టాప్ న్యూస్

నేడు నిజామాబాద్‌లో
## అమిత్ షా పర్యటన



- పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్న హోంమంత్రి

02

పోలీసు శాఖలో
## బదిలీలు

- 44 మంది డీఎస్పీలను ట్రాన్స్‌ఫర్ చేసిన సర్కార్
- ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ జితేందర్

02

కంటోన్మెంట్ భూములకు
## లైన్ క్లియర్

- రక్షణ శాఖతో తెలంగాణ సర్కార్ ఒప్పందం
- జేబీఎస్ నుంచి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మార్గం సుగమం

02



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

ట్యాపింగ్ తీగల్లో..
## నేతల భవిష్యత్తు

ట్యాపింగ్ తీగల చుట్టూ తెలంగాణ రాజకీయ నేతల వ్యూహాలు తిరుగుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు, కల్వకుంట్ల కుటుంబంలో అంతర్గత విభేదాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడు వ్యూహం బీఆర్ఎస్‌ను రక్షణాత్మక స్థితిలో నిలిపాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు, మొయినాబాద్ ఫాంహౌజ్ లో నలుగురు ఎమ్మెల్యేల కేసు గులాబీ పెద్దల అరెస్ట్ లకు దారితీస్తుందా? ప్రభాకర్ రావు కస్టడీ తర్వాత కేసు మరిన్ని మలుపులు తీసుకునే అవకాశముందా? అనే చర్చ జరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ప్రజలు నమ్ముతుండగా, ఈ అంశంలో బిఆర్ఎస్ కు సానుభూతి కనబడడం లేదు. దీనిని నిరూపించడం సిట్ కు కీలకం. కవిత రాజకీయ కార్యకలాపాలు ఆమె స్థానాన్ని బలోపేతం చేసే దిశగా ఉండగా, బిఆర్ఎస్ పై ఒత్తిడి పెంచుతున్నాయి.

- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో

ANN తెలుగు

Follow: @ANNTELUGU

29-06-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 206 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## కవిత పీఏకు నోటీసులు!

- ఆయన ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తింపు
- ప్రణీత్ రావు ఫోన్‌లో బయటపడ్డ ఆడియో రికార్డింగ్స్
- విచారణకు వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని అధికారులు ఆదేశం

వివరాలు 2లో



## చెరువుల్లో దొంగలు పడ్డారు

- శిఖం, ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో బోర్లు వేసి తోడకం
- వేల ట్యాంకర్లతో నీటి అక్రమ రవాణా
- పారిశ్రామిక ప్రాంతాలు, కాలనీల్లో విక్రయాలు
- 20 వేల లీటర్ల ట్యాంకర్ ధర రూ. 10 వేలు
- భారీ వాహనాలతో చెరువుకట్టలు, రోడ్లు ఛిద్ర

వివరాలు 3లో




## మంత్రి అడ్లూరికి తప్పిన ప్రమాదం

- ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదం
- రన్నింగ్‌లోనే ఊడిపోయిన టైరు.. కారు స్వల్పంగా ధ్వంసం

వివరాలు 3లో



# మాకు మెట్రో ఇవ్వరా..?

### ఏం పాపం చేశాం.. ఎందుకీ వివక్ష?

కేంద్రాన్ని ప్రశ్నించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ వస్తున్న అమిత్ షాను కూడా కలిసి మళ్ళీ అడుగుతా

మాకు మెట్రో.. ట్రిపుల్ ఆర్ .. మూసీ రివర్ ఫ్రంట్ ఇవ్వండి

ఎన్ని ఆటంకాలు ఎదురైనా .. కంచ గచ్చిబౌలి అభివృద్ధి ఆగదు

కొత్త కంపెనీల ఏర్పాటుతో 5 లక్షల మందికి ఉద్యోగాలు

పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభించిన ముఖ్యమంత్రి



**హైదరాబాద్, మహా:** తెలంగాణపై కేంద్రానికి ఎందుకీ వివక్ష అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. విపక్ష పార్టీలున్న చెన్నై, బెంగళూరుకు మెట్రో ఇచ్చారు.. గుజరాత్ లో రివర్ ఫ్రంట్ చేసుకున్నారు. తాము మెట్రో,మూసీ,ఆర్ఆర్ఆర్ అడిగితే కేంద్రం వివక్ష చూపుతోందన్నారు. తమ నివేదికలో ఏమైనా లోపాలు ఉన్నాయా?. ఏం పాపం చేశామో చెప్పాలని సీఎం ప్రశ్నించారు. నివేదికలో తప్పులుంటే సరిచేసుకుంటామని, కానీ రాష్ట్రానికి రావాల్సినవి ఇయ్యాల్సిందేనన్నారు.

మిగతా 3లో

## నాగార్జున రియల్ హీరో

- ఎన్ కన్వెన్షన్ ను కూల్చినా.. నాగార్జున చెరువు కోసం రెండెకరాలు ఇచ్చాడు
- సీఎం రేవంత్ కామెంట్స్ వైరల్

03





# ముహూర్తం ఖరారు

### జూలై 1న బీజేపీ అధ్యక్షుడి ప్రకటన

### లక్ష్మణ్ వైపు నేతల మొగ్గు

ధర్మపురి అరవింద్... ఈటల రాజేందర్ ల మధ్య తీవ్ర పోటీ

ఉత్కంఠ కలిగిస్తున్న కమలం పాలిటిక్స్

రేసులో డికె అరుణ, ఎన్ రామచందర్ రావు, పాయల్ శంకర్

నేటి అమిత్ షా భేటీలో స్పష్టత వచ్చే అవకాశం

**హైదరాబాద్, మహా:**

బీజేపీ తెలంగాణ అధ్యక్ష ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. జులై ఒకటిన పార్టీ అధ్యక్ష ఎన్నిక ప్రకటన ఉంటుంది. నెలల తరబడి పేరుకుపోయిన నైరాశ్యం, కేడర్‌లో అసహనం వంటి ఘట్టాలన్నింటికీ తెరపడుతుంది. కొత్త అధ్యక్షుడు ఎవరో జూలై ఫస్ట్ న తేలిపోతోంది.

మిగతా 2లో

## నన్ను రెచ్చగొట్టొద్దు చావుకు భయపడను

### కొండా మురళి సెన్సేషనల్ కామెంట్

క్రమశిక్షణ కమిటీకి ఇచ్చిన లేఖలో సంచలన విషయాలు

మంత్రి పొంగులేటిపై ఘాటు వ్యాఖ్యలు

ఎప్పుడూ గెలవని నేత మా డీసీసీ అని వ్యాఖ్య



**హైదరాబాద్, మహా :** ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ లో నేత మధ్య వర్గ విబేధాలు తారా స్థాయికి చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి గాంధీ భవన్‌లో పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవిని కలిశారు. ఉమ్మడి జిల్లా పార్టీలోని విబేధాలు, జరుగుతోన్న తాజా పరిణామాలపై క్రమశిక్షణ కమిటీకి మొత్తం ఆరు పేజీలతో కూడిన లేఖను అందజేశారు. అనంతరం గాంధీభవన్ నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలో ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా గెలిచిన వ్యక్తిని తానేనని అన్నారు. బీసీలకు న్యాయం చేసే పనిలో తాను నిత్యం బిజీగా ఉన్నానని తెలిపారు.

మిగతా 2లో



# జూరాలపై మరో కొత్త బ్రిడ్జి

### రూ. 100 కోట్లు మంజూరు చేస్తున్నాం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటన
- కేసీఆర్ ఇరిగేషన్ శాఖను భ్రష్టు పట్టించారు
- ప్రాజెక్ట్‌లను పట్టించుకోకపోవడం వల్లే దెబ్బతింటున్నాయి
- ర్యాలంపాడు జలాశయాన్ని పరిశీలించిన ఉత్తమ్, వాకిటి

**జోగులాంబ, మహా:** జూరాల డ్యామ్‌కు అనుసంధానంగా మరో బ్రిడ్జికి రూ. 100 కోట్లు మంజూరు చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ శాఖని భ్రష్టు పట్టించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్ట్‌లకు మాజీ సీఎం కేసీఆర్ మెయింటనెన్స్ చేయలేదని మండిపడ్డారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీహరి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు ప్రాజెక్టులను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కమీషన్లకు కక్కుర్తి పడ్డారని ఆరోపించారు.

మిగతా 2లో



మంత్రి పదవి ఇవ్వకపోయినా
## పర్వాలేదు

- మునుగోడుకు అన్యాయం చేస్తే సహించను
- ఎల్బీనగర్‌లో పోటీ చేయమన్న కాదని ఇక్కడ నిలబడ్డ
- కేసీఆర్ రిటర్డై.. ఫామ్‌హౌస్‌లో రెస్ట్ తీసుకుంటే మంచింది
- వెయ్యి ఏళ్లయినా తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాదు
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

వివరాలు 3లో

## ఆరోగ్య శాఖలో కొలువులు

- నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ శుభవార్త
- 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- జులై 10 నుంచి దరఖాస్తులు ప్రారంభం



02

# నన్ను రెచ్చగొట్టొద్దు.. చావుకు భయపడను

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి కలకాలం సీఎంగా ఉండాలని కోరుకునే వ్యక్తినని పేర్కొన్నారు. కాంగ్రెస్ పెద్దలంటే తనకు అపారమైన గౌరవం ఉందన్నారు. తనను ఎవరూ ఎలాంటి ప్రశ్నలు అడగలేదని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తన ముందు ఉన్న లక్ష్యమని స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో జరుగుతోన్న పరిణామాలపై పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి అన్ని విషయాలు వివరించానని అన్నారు. తనను రెచ్చగొట్టొద్దని, చావుకు కూడా భయపడే వ్యక్తి కాదని కొండ మురళి పరోక్షంగా సొంత పార్టీలోని ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులకు సవాల్ విసిరారు. నేను చావుకు భయపడను, నా శరీరంలో నాలుగు బుల్లెట్ లు ఉన్నాయని కొండా మురళీ వ్యాఖ్యానించారు.

**మంత్రి పొంగులేటినీ వదిలిపెట్టని కొండా**

అంతకు ముందు క్రమశిక్షణా కమిటీ ముందు హాజరైన కొండా మురళి ఊహించని ట్విస్ట్ ఇచ్చారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇస్తారని ఆయన పైన పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని అనుమానిస్తున్న తరుణంలో డిసిప్లినరీ కమిటీ ముందు కొండ మురళి జిల్లా పార్టీ నేతలకు రివర్స్ కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటిపై కొండా మురళి హాట్ కామెంట్స్ చేశారు. వరంగల్ లోని కీలక నేతలపైనా, వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పైనా కొండా మురళి తీవ్రఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీకి ఇచ్చిన లేఖ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో హాట్ టాపిక్ గా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పైన, అలాగే వరంగల్ ఇన్చార్జి మంత్రి పొంగులేటి



శ్రీనివాసరెడ్డి పైన ఆయన హాట్ కామెంట్స్ చేశారు.

కొండా మురళి క్రమశిక్షణ కమిటీకి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం 2007లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన నియోజకవర్గాల పునర్ విభజన ప్రక్రియలో వరంగల్ కు సంబంధించిన వ్యవహారాన్ని నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనకు అప్పగించగా, వరంగల్ జిల్లాకు సంబంధించి రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించేలా నియోజకవర్గాల పునర్విభజన చేయడంలో తనది కీలక పాత్ర అని ఆయన పేర్కొన్నారు. దాని ప్రకారం అప్పటి కాంగ్రెస్ సీనియర్ నేత రామ సహాయం సురేందర్ రెడ్డి సీటు కోల్పోయారని కక్షతో ప్రస్తుతం ఆయన అల్లుడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సతీమణి కొండా సురేఖ మీద కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాడని, తాజా పరిణామాలతో అర్థమవుతుందని కొండా మురళి పేర్కొన్నారు. ఇక వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యను వెంటబెట్టుకొని వరంగల్ ఈస్ట్ నియోజకవర్గంలో తిరుగుతున్నాడన్నారు. బసవరాజు సారయ్య సురేఖ మీద పోటీ చేసి ఓడిపోయారని కొండా మురళి పేర్కొన్నారు. ఇక ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య కూడా రామ సహాయం సురేందర్ రెడ్డికి ప్రధాన శిష్యుడు, ఆయన కూడా తమకు వ్యతిరేకంగానే పని చేస్తున్నాడని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ కు చెందిన నాయకులని, గతంలో ఆయన కొండ సురేఖ మీద పోటీ చేసి ఓడిపోయారని పేర్కొన్నారు. ఇక డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఈరోజు వరకు ఒక ఎలక్షన్ లో కూడా గెలవలేదని, ఆమె తమ డీసీసీ ప్రెసిడెంట్ అని వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాస్ లీడర్ గా ఉన్న తాము ఎన్నికల్లో గెలిచామని, బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారినప్పుడు 26 మంది కార్పొరేటర్లు తమతో పాటు వచ్చారని, అది కొండా మురళి, కొండా సురేఖ దంపతుల పవర్ అని మురళి పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు తో తమకు సత్సంబంధాలు ఉన్నాయని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కు మద్దతు తెలిపినప్పటికీ ప్రస్తుతం ఆయన తమకు వ్యతిరేకంగా ఇతర నాయకులతో కలిసి పనిచేస్తున్నారని, అయినప్పటికీ ఆయనతో మంచి సంబంధాలే ఉన్నాయన్నారు. సీతక్క తో ఎటువంటి ఇబ్బంది లేదని, కావాలని సోషల్ మీడియాలో ఆమెతో గ్యాప్ ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇక పరకాల రేవూరి ప్రకాష్ రెడ్డిని ఎన్నికల సమయంలో మద్దతు ఇచ్చి నిలబెడితే, గెలిపిస్తే తమకు వ్యతిరేకంగా రాజకీయాలు చేస్తున్నారని, రెచ్చగొట్టే ధోరణితో ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. వరంగల్ వెస్ట్ నాయిని రాజేందర్ రెడ్డి తనకు సంబంధం లేని వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎంజీఎం ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి మా అధికార పరిధిలోకి చొచ్చుకొని రావడం సహేతుకం కాదు కదా అంటూ ప్రశ్నించారు. స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీ నుండి వచ్చి స్థానిక కాంగ్రెస్ పార్టీ నేత ఇందిరను ఇబ్బంది పెడుతున్నారని, అయినప్పటికీ ఆయన నియోజకవర్గంలో ఇన్వాల్వ్ కావడం లేదని, కడియం శ్రీహరి కావాలని చాలామందిని వేధిస్తున్నాడని పేర్కొన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఎర్రబెల్లి దయాకర్ రావుకి ఎదురు నిలిచి పోరాడింది కాబట్టి ఆమెకు సపోర్ట్ చేసి అన్ని విధాలుగా నిలిచి మద్దతు ఇచ్చామని, ఆమెతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ప్రజా ప్రతినిధులతో సంబంధాలపై లేఖలో వివరణ ఇచ్చిన కొండా మురళి డోర్నకల్ ఎమ్మెల్యే నాయక్ నియోజకవర్గంలో తమకు పెద్దగా పట్టులేదని కానీ తమకు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని, అక్కడ వాళ్ళు ఎవరైనా వచ్చి పనులు చేసి పెట్టమంటే చేసి పెడుతున్నామన్నారు. జిల్లాలో ప్రజా ప్రతినిధులతో తమ సంబంధాలపై తమ లేఖలో కొండా మురళి చాలా స్పష్టంగా పేర్కొన్నారు.

# జూరాలపై మరో కొత్త బ్రిడ్జి

(మొదటిపేజీ తరువాయి)

భారీ వాహనాలను జూరాలపై నడపటం సేఫ్టీ కాదని ఆనాడే అధికారులు నిర్ధారించారని, కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. భారీ వాహనాల వల్ల జూరాల ప్రాజెక్ట్‌కు ప్రమాదం ఉందని తెలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరపున రూ. 100 కోట్లు మరో బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేస్తున్నామని వెల్లడించారు.

**పూడికతీత పనులు చేపడతాం..**

పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రాజెక్ట్‌లను పట్టించుకోకపోవడంతోనే దెబ్బతింటున్నాయని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో పూడికతీత పనులు కూడా చేపట్టలేదని ధ్వజమెత్తారు. జూరాల ప్రాజెక్టు పూడికతీత పనులు వెంటనే చేపడతామని స్పష్టం చేశారు. రూ.300 కోట్లతో రెండవ గ్యాంటి క్రెన్ మంజూరు చేస్తున్నామని తెలిపారు. 4 టీఎంసీల నీటిని ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నింపేలా పనులు చేపడుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ పనులను కూడ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 90శాతం పూర్తయినా నెట్టెంపాడు పనులను కూడా కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వంలో నెట్టెంపాడుకి రూ.2753 కోట్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. డిసెంబర్ నాటికి 100శాతం పనులు చేసి నెట్టెంపాడు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మక్తల్‌లో పెండింగ్‌లో ఉన్న పనులన్నీటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు. ఇరిగేషన్ శాఖలో 1100 మంది ఇంజనీర్లను నియమించామని ప్రకటించారు.

**ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం..**

ప్రతిపక్షాలు సాగు, నీటి ప్రాజెక్ట్‌లపై తప్పుడు ప్రచారాలు చేయొద్దని అన్నారు. ఇరిగేషన్ శాఖ అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.వరదలు ముందుగా రావడంతో జూరాల ప్రాజెక్ట్ పనులు పూర్తి కాలేదని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. జూరాల ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాల నేతలు భయాందోళనకు గురి చేశారని చెప్పారు. కాళేశ్వరం కుంగిపోతే ఏమికాదని మాట్లాడిన ప్రతిపక్షాలు జూరాలపై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూసిన ప్రజలు నమ్మరని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

# రేవంత్.. రాజీవ్‌గా పేరు మార్చుకో

- ఢిల్లీ బాస్‌ల దగ్గర మార్కుల కోసం పేర్లు మారుస్తారా?
- అధికారంలోకి వచ్చాక 'అన్నపూర్ణ పథకం' పేరు మళ్లీ పెడుతాం
- ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఆస్కారం ఉండకూడదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహా:** జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తోన్న 'అన్నపూర్ణ పథకం' పేరు మార్పుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై 'ఎక్స్'లో కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఢిల్లీ బాస్‌లకు మీ విధేయత చూపించాలనుకుంటే మీ పేరును రాజీవ్ లేదా జవహర్‌గా ఎందుకు మార్చుకోకూడదని ప్రశ్నించారు. అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చడం హాస్యాస్పదమన్నారు. 2028లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అర్ధరహిత నిర్ణయాలన్నింటినీ రద్దు చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం అందిస్తున్నారు. ఇందిర క్యాంటిన్లుగా పేరు మార్చి.. రూ.5కే భోజనం, అల్పాహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**ఆయన మిత్రులదే ఈ పాపం..**

తెలంగాణలో అరాచకత్వం పెట్రేగిపోతుందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి లాంటి నేతలు ఈ రాష్ట్రాన్ని నడిపిస్తుంటే, అబద్ధాలు, దుష్ప్రచారాలుగా సమాజంలో రోజువారి సాధారణ అంశాలుగా మారిపోతాయని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఎన్నటికీ ఆస్కారం ఉండకూడదని సూచించారు. శాంతియుతంగా



ఉండాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అబద్ధాలకు, అసందర్భ ప్రేలాపనలకు, మీడియా ముసుగులో చేసే నీచపు రాజకీయాలకు కూడా అస్సలు తావుండకూడదని సూచించారు. ఈనాటి దిగజారుడు రాజకీయాల్లో అన్ని మెయిన్ స్ట్రీమ్‌కి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన మిత్రులదే ఈ పాపమని విమర్శించారు. బీఆర్ఎస్ సోదర, సోదరీమణులందరూ ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్‌పై ముఖ్యమంత్రి, ఆయన అనుచరగణం చేస్తున్న బురదల్లే కుట్రపూరిత కార్యక్రమంపై చట్టబద్ధమైన ప్రక్రియను నమ్మి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

# కవిత పీఏకు నోటీసులు!

- ఆయన ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తింపు
- ప్రణీత్ రావు ఫోన్‌లో బయటపడ్డ ఆడియో రికార్డింగ్స్
- విచారణకు వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని అధికారులు ఆదేశం

**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో భాగంగా ఎమ్మెల్సీ కవిత వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా నోటీసులు జారీ చేసింది. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్‌లో కవిత పీఏకు సంబంధించిన కొన్ని ఆడియో రికార్డింగులను అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలు రాబట్టేందుకు సిట్ ఆయనను విచారణకు పిలిచింది.

**బీఆర్ఎస్ నేతలకు సైతం..?**

ఫోన్ ట్యాపింగ్ కేసుపై దర్యాప్తును ముమ్మరం చేసిన సిట్ అధికారులు, ఇప్పటివరకు మొత్తం 618 మంది ఫోన్లను ట్యాప్ చేసినట్లు తేల్చారు. వీరిలో ఇప్పటికే 228 మంది బాధితుల వాంగ్మూలాలను నమోదు చేశారు. పలువురు వీఐపీల నుంచి కూడా కీలక సమాచారం సేకరించినట్లు తెలిసింది. ప్రణీత్ రావును విచారించినప్పుడు లభించిన ఆధారాల మేరకు దర్యాప్తు పరిధిని మరింత విస్తరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ కవిత పీఏతో పాటు మరికొందరు బీఆర్ఎస్ నేతలకు సైతం సిట్ అధికారులు నోటీసులు పంపినట్లు సమాచారం. ఈ పరిణామంతో బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సిట్ విచారణలో ఇంకా ఎవరెవరి పేర్లు బయటకు వస్తాయోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

# మంత్రి పదవి ఇవ్వకపోయినా పర్వాలేదు

- మునుగోడుకు అన్యాయం చేస్తే సహించను
- ఎల్బీనగర్‌లో పోటీ చేయమన్న కాదని ఇక్కడ నిలబడ్డ
- కేసీఆర్ రిటర్డై.. ఫామ్‌హౌస్‌లో రెస్ట్ తీసుకుంటే మంచింది
- వెయ్యి ఏళ్లయినా తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాదు
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోయినా పర్వాలేదని, కానీ మునుగోడు నియోజకవర్గానికి అన్యాయం చేస్తే సహించేది లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది.. అభివృద్ధి జరుగుతుందని ప్రజలు నమ్మకంతో తనను గెలిపించారని.. అందుకే ప్రభుత్వం నుంచి సహకారం అవసరమన్నారు. మునుగోడు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. శివన్న గూడెం, ఉదయ సముద్రం, మూసీ ఇరిగేషన్ పనులన్నీ పూర్తి చేయిస్తానని..రోడ్లన్ని అభివృద్ధి చేయిస్తున్నానని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ వెయ్యి ఏళ్లయినా అధికారంలోకి రాదని.. కేసీఆర్ రిటరైపోయి ఫామ్‌హౌస్‌లో రెస్ట్ తీసుకుంటే మంచిదన్నారు.

**అక్కడ పోటీ చేస్తే మంత్రి పదవి..**

కేసీఆర్ అధికారంలో ఉండి తనను మునుగోడు ఉప ఎన్నికలో ఓడించేందుకు ఫోన్ ట్యాపింగ్ తో తమ డబ్బులు పట్టుకుని, తన కోసం పనిచేసే వారిపై బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. వంద మంది ఎమ్మెల్యేలను దించి అష్టదిగ్బంధం చేసి అధర్మం పోరాటం



చేశారని.. అందుకే కేసీఆర్ అధికారం కోల్పోయడన్నారు. 2018లో తనపై నమ్మకంతో మునుగోడు ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారని..ఆ సమయంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడంతో కేసీఆర్ తమ గొంతు నొక్కేశాడని ఆరోపించాడు. అయినప్పటికీ అసెంబ్లీలో మునుగోడు నియోజకవర్గ సమస్యలపై గళం వినిపించానని చెప్పుకొచ్చారు. మునుగోడు ఉప ఎన్నికలో అదే కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ఇక్కడి ప్రజల కాళ్ల వద్దకు తీసుకొచ్చానని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎల్బీనగర్‌లో పోటీ చేస్తే మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ నాయకత్వం చెప్పినా.. మంత్రి పదవిని కూడా పక్కనపెట్టి తనను ఆదరించిన మునుగోడు ప్రజలపై ప్రేమతో ఇక్కడి నుంచి పోటీ చేసి గెలిచానన్నారు.

## కంటోన్మెంట్ భూములకు లైన్ క్లియర్

- రక్షణ శాఖతో తెలంగాణ సర్కార్ ఒప్పందం
- జేబీఎస్ నుంచి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మార్గం సుగమం

**హైదరాబాద్, మహా;** రక్షణ శాఖతో తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. జేబీఎస్ నుంచి శామీర్ పేట్, ప్యారడైజ్ నుంచి డైరీ ఫామ్ రోడ్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల కోసం కంటోన్మెంట్ భూములు ఇవ్వడానికి రక్షణ శాఖ సిద్ధమైంది. రక్షణ శాఖ భూములు ఇచ్చినందుకు ప్రతిగా.. శామీర్ పేట్ లో భూములను తెలంగాణ సర్కార్ ఇవ్వనుంది. ఈ మేరకు శనివారం రక్షణ శాఖతో ఎంఓయూ చేసుకుంది తెలంగాణ ప్రభుత్వం. ఇరు శాఖలకు చెందిన సీనియర్ అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.. దీంతో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం 90 ఎకరాల భూములను కేంద్ర రక్షణ శాఖ ఇవ్వనుంది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మార్గం సుగమం.. రక్షణ శాఖ భూముల కారణంగా లేట్ అవుతున్న ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ పనులు.. ఈ ఒప్పందం పూర్తయితే ఎలివేటెడ్ కారిడార్ పనులు మరింత స్పీడ్ కానున్నాయి. స్టేట్ హైవే 1 పై జేబీఎస్ నుంచి శామీర్ పేట్ వరకు 22 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ తో పాటు నేషనల్ హైవే 44 పై ప్యారడైజ్ నుంచి డైరీ ఫామ్ వరకు 5 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనుంది.

# ఆరోగ్య శాఖలో కొలువులు

## నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ శుభవార్త

- 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- జులై 10 నుంచి దరఖాస్తులు ప్రారంభం

**హైదరాబాద్, మహా:** నిరుద్యోగులకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో భారీ శుభవార్త చెప్పింది. సర్కార్ కొలువు కోసం ఎదురు చూస్తున్న చాలా మందికి ఇది సువర్ణావకాశంగా చెప్పవచ్చు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్ మెంట్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు... మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆరోగ్యశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.

**జులై 10 నుంచి దరఖాస్తులు..**

ముఖ్యంగా వివిధ యూనివర్సిటీల పరిధిలోని 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్ని భర్తీ చేయనున్నారు. నోటిఫికేషన్ లో.. జులై 10 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. చివరి తేదీ జులై 17, సాయంత్రం 5 వరకు మాత్రమే అప్లై చేయడానికి అవకాశం ఇచ్చారు. పూర్తి వివరాలను అధికారిక వెబ్ సైట్ లో ఆరోగ్యశాఖ విభాగం పొందుపర్చారు. జులై 18 నుంచి 19 సాయంత్రం వరకు అభ్యర్థులు ఏదైనా మార్పులు ఉంటే.. ఎడిట్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దీనిలో మల్టీ జోన్ 1 లో మొత్తం 379 పోస్టులు, మల్టీ జోన్ 2 మొత్తం 228 పోస్టులు ఉన్నాయి. ప్రొఫెసర్ పోస్టులకు జీతాలు.. యూనివర్సిటీ గ్రాండ్స్ ప్రకారం.. రూ. 68,900ల నుంచి రూ. 2,05,500 ఉందని నోటిఫికేషన్ వెల్లడించారు. అదే విధంగా మరో ఎనిమిది యూనివర్సిటీల్లో వివిధ విభాగాల్లో ఖాళీగా పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుంది. ముఖ్యంగా.. ఉస్మానియా యూనివర్సిటీ, శాతావాహన యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీలో ప్రొఫెసర్ ల పోస్టులను భర్తీ చేయనున్నారు.

**పోస్ట్ పేరు - పోస్టుల సంఖ్య..**

- అసిస్టెంట్ ప్రొఫెసర్ (అనాటమీ) 22
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఫిజియాలజీ) 29
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (పాథాలజీ) 15
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (కమ్యూనిటీ మెడిసిన్) 25
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (మైక్రోబయాలజీ) 15
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఫార్మకాలజీ) 28
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఫోరెన్సిక్ మెడిసిన్ మరియు టాక్సికాలజీ) 21
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (బయోకెమిస్ట్రీ) 18
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్) 9
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (జనరల్ మెడిసిన్) 47
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (జనరల్ సర్జరీ) 43
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (పీడియాట్రిక్స్) 28
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (అనస్థీషియా) 44
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (రేడియోడయాగ్నోసిస్) 21
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (సైకియాట్రీ) 8
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (రెస్పిరేటరీ మెడిసిన్ టీ.బీ అండ్ సీ.డీ(పల్మనరీ మెడిసిన్)) 5
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (డెర్మటాలజీ, వెనిరియాలజీ మరియు లెప్రసీ (డీవీఎల్) డెర్మటాలజీ ఎస్టీడీ) 5
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఫిజికల్ మెడిసిన్ మరియు రిహాబిలిటేషన్) 3
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ప్రసూతి అండ్ గైనకాలజీ) 90
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆప్తాల్మాలజీ) 4
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆర్థోపెడిక్స్) 12
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఓటోరైనో) లారింగాలజీ హెడ్ 5
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్) 21
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎమర్జెన్సీ మెడిసిన్) 15
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (కార్డియాలజీ) 9
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (థొరాసిక్ సర్జరీ / కార్డియాక్ సర్జరీ (C.T. సర్జరీ)) 14
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎండోక్రినాలజీ) 7
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ) 9
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (న్యూరాలజీ) 3
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (న్యూరోసర్జరీ) 7
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (ప్లాస్టిక్ & పునర్నిర్మాణ శస్త్ర చికిత్స) 10
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (పీడియాట్రిక్ సర్జరీ) 5
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (యూరాలజీ) 6
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (నెఫ్రాలజీ) 4
- మల్టీ జోన్ 1లో 379 పోస్టులు, మల్టీ జోన్ 2లో 228 పోస్టులు మొత్తం 607 పోస్టులు భర్తీ చేయనున్నారు.

దరఖాస్తుదారులను 100 పాయింట్ల ఆధారంగా ఎంపిక చేస్తారు. అర్హత పరీక్షలో పొందిన మార్కుల శాతానికి గరిష్టంగా 80 పాయింట్లు కేటాయిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు/సంస్థలు /కార్యక్రమాలలో కాంట్రాక్ట్/ అవుట్‌సోర్స్ ప్రాతిపదికన చేసిన సేవలకు గరిష్టంగా 20 పాయింట్ల వరకు కేటాయిస్తారు. అర్హత పరీక్షలో పొందిన మార్కుల శాతం ఆధారంగా గరిష్టంగా 80 పాయింట్లు ఇస్తారు. అంటే సంబంధిత పీజీ డిగ్రీ/సూపర్ స్పెషాలిటీలో పొందిన మార్కులను 80 శాతం బేస్‌గా మార్చారు. మార్కులు ఇవ్వని విశ్వవిద్యాలయాలలో చదివిన అభ్యర్థులకు, గ్రేడ్‌లను మార్కులుగా మార్చడం ద్వారా 80 శాతం బేస్‌గా పరిగణించనున్నారు.




# పోలీసు శాఖలో బదిలీలు

- 44 మంది డీఎస్పీలను ట్రాన్స్‌ఫర్ చేసిన సర్కార్
- ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ జితేందర్

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర పోలీసు శాఖలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 44 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) స్థాయి అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ బదిలీలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా పలువురు అధికారులకు కీలక పోస్టింగులు కేటాయించారు. బదిలీ అయిన వారిలో వై. నాగేశ్వరరావును సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఏసీపీగా నియమించారు. అదేవిధంగా, ఆకుల చంద్రశేఖర్‌కు మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీగా, సంపత్‌కుమార్‌కు రాచకొండ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏసీపీగా బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న డీఎస్పీలకు స్థానచలనం కల్పిస్తూ ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# కోర్టు భవనంపై నుంచి దూకిన ఫ్యామిలీ


**ఒకరు మృతి.. ముగ్గురి పరిస్థితి విషమం.. మెదక్ జిల్లాలో ఘటన**

**మెదక్ మహా:** ఓ కుటుంబం మెదక్ జిల్లా కోర్టు భవనంపై నుంచి దూకిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఘటనలో భార్య రమ్య (30) మృతి చెందగా.. భర్త నవీన్‌తోపాటు ఐదు, రెండేళ్ల వయసున్న కుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. కొన ఊపిరితో ఉన్న క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. బాధితులను దౌల్తాబాద్ గ్రామవాసులుగా గుర్తించారు. గతేడాది అత్తగారి ఇంటిపై సుతిల్‌బాంబు వేయడంతో నవీన్‌పై రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పుట్టింటిపై బాంబు వేసిన నాటి నుంచి భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇవాళ కోర్టు విచారణకు దంపతులు హాజరయ్యారు. కోర్టు ప్రాంగణంలో మరోసారి గొడవపడి భవనంపై నుంచి దూకినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# నేడు నిజామాబాద్‌లో అమిత్ షా పర్యటన

**పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్న హోంమంత్రి**

**హైదరాబాద్, మహా:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేడు తెలంగాణలో పర్యటించనున్నారు. ఆదివారం నిజామాబాద్‌లో పలు కార్యక్రమాల్లో అమిత్ షా పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారైంది. అమిత్ షా పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 11:25లకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:45కు బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లనున్నారు. అక్కడి నుంచి వినాయక్‌నగర్‌లోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్ షా ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2



గంటల నుంచి 2:30 వరకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలోనే ఆయన ఉండనున్నారు. 2:35కు నిజామాబాద్ కంటేశ్వర్ క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించనున్నారు. 2: 45 నిమిషాల నుంచి 4గంటల వరకు పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో జరిగే కిసాన్ మహాసభలో అమిత్ షా పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్టుకు అమిత్ షా చేరుకుంటారు.

# ముహూర్తం ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర పార్టీ పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న విషయంలో కేంద్ర పెద్దలు ఇప్పటికే అవగాహనకు వచ్చారు. ఆదివారం అమిత్ షా పర్యటన సందర్భంగా నేతలతో కీలక భేటీలో దీనికి సంబంధించిన స్పష్టత ఇచ్చే అవకాశాలున్నాయి. ఢిల్లీ పెద్దలు ఎవరివైపు మొగ్గు చూపుతున్నారు? పాతోళ్ళకి పట్టం కట్టబోతున్నారా..? లేక కొత్త వాళ్ళకే కిరీటమా అన్న చర్చలు సాగుతున్నాయి. పార్టీలో మొదటి నుంచి ఉన్న పాతకాపులకే ఛాన్స్ ఇవ్వాలన్నది కొందరి డిమాండ్. పాత, కొత్త అన్నది కాదు... వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారం దిశగా నడిపించే నాయకుడు కావాలన్నది ఇంకొందరి మాట. ఈ క్రమంలో... గ్రూపులకు అతీతంగా మెజారిటీ నేతలు పార్టీ సంస్థాగత ఎన్నికల జాతీయ రిటర్నింగ్ అధికారిగా ఉన్న లక్ష్మణ్ పేరు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ స్థానం కోసం ఫైనల్ రేస్ లో ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్ మధ్య తీవ్ర పోటీ ఉందని చెబుతున్నారు. అర్వింద్ కు అవకాశాలు మెరుగుపడ్డాయని కొందరు చెబుతున్నారు. అయితే మహిళలకు ఇవ్వాలనుకుంటే డికె అరుణకు మించిన నేత లేరని, ఇక ఎన్. రామచందర్ రావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ల పేర్లు కూడా ప్రతిపాదనల్లో ఉన్నాయని చెబుతున్నారు. బిజెపిలో శనివారం రాత్రి వరకు ఉన్న ప్రచారంలో ధర్మపురి అరవింద్ కే పీఠం కట్టబెట్టవచ్చని, పోటీ తీవ్రంగా ఉంటే మధ్యేమార్గంగా లక్ష్మణ్ కు దక్కవచ్చని చెబుతున్నారు. అయితే బిజెపి నిర్ణయాలు అనూహ్యంగా ఉంటాయి కాబట్టి.. జూలై 1నే స్పష్టత వచ్చే అవకాశముంది.

# చెరువుల్లో దొంగలు పడ్డారు

## శిఖం, ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లలో బోర్లు వేసి తోడకం

- వేల ట్యాంకర్లతో నీటి అక్రమ రవాణా
- పారిశ్రామిక ప్రాంతాలు, కాలనీల్లో విక్రయాలు
- 20 వేల లీటర్ల ట్యాంకర్ ధర రూ. 10 వేలు
- భారీ వాహనాలతో చెరువుకట్టలు, రోడ్లు ఛిద్రం


దళారుల దందా.. అక్రమ పంథా

**హైదరాబాద్, మహా :** చెరువుల్లో దొంగలు పడ్డారు. భారీ ఎత్తున బోర్లు వేసి.. జలవనరులను దోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్ మహానగరపాలక సంస్థతోపాటు శివారు ప్రాంతాల్లో మంచినీటి అవసరాలను కొందరు అక్రమ వ్యాపారానికి వాడుకుంటున్నారు. నగరం చుట్టూ ఉన్న నీటి వనరులు మురుగు, రసాయన వ్యర్థాలతో దాదాపు కలుషితమై వినియోగానికి పనికి రావడం లేదు. దీంతో అక్రమ వ్యాపారులు కొన్ని చెరువులు, కుంటల దిగువ, ఎగువ ప్రాంతాల్లో బోర్లు వేసి, భూగర్భజలాలను తోడేస్తున్నారు. ఈ నీటిని పరిశ్రమలు, కాలనీల్లో వినియోగానికి తరలిస్తు న్నారు. స్థానిక రాజకీయ నాయకులు, పలుకుబడి ఉన్నవారు టాంకర్లను ఏర్పాటు చేసుకుని ఇలా నీటి వ్యాపారం చేస్తున్నారు. నిత్యం వేల కొద్దీ ట్యాంకర్లు ఈ అక్రమ వ్యాపారంలో పరుగులు పెడుతున్నారు.

**ఎఫ్ఎల్ కు కన్నం**

చెరువులు, కుంటల శిఖాలు, పూర్తి మట్టం స్థాయి (ఎఫ్ఎల్), బఫర్ జోన్లు, మత్తడి ప్రాంతాలను కబ్జా చేస్తున్నారు. ఆ ప్రాంతాల్లో భారీ గుంతలు తవ్వి నీరు ఇంకిపోకుండా టార్పాలిన్లతో కప్పేస్తున్నారు. అదే ప్రాంతంలో 8, 12 ఇంచుల బోర్లు వేసి నీటిని తోడి గుంతల్లో నిల్వ చేసుకుని విక్రయిస్తున్నారు. ఒక్కో బోరు, మోటారు, జనరేటర్, నీటి గుంత నిర్మాణం, టార్పాలిన్ కు రూ.3 లక్షల వరకు ఖర్చు చేస్తు న్నారు. బోర్లకు కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ తీగలు కూడా అమర్చుతున్నారు..

పటాన్ చెరువు అమీన్ పూర్ ప్రాంతాల్లో ఈ తరహా వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు బోర్లు తవ్వి నీటిని ఎత్తిపోయడం వరకు పరిమితమవగా, రవాణా, విక్రయాలను ట్యాంకర్ల యజమానులు చూసుకుంటు న్నారు. కొన్నిచోట్ల బోరు, ట్యాంకర్లు కూడా ఒకే యజమానికి ఉంటున్నాయి. చెరువులు, కుంటలున్న ప్రాంతాలే కాకుండా అసైన్డ్ భూములు ప్రభుత్వ, అటవీ భూముల్లోనూ బోర్లు వేసి నీటిని తరలిస్తున్నారు. కాలుష్యం వల్ల సాగు మానుకున్న భూముల యజమానులు ఆదాయం కోసం తమ పొలాల్లోని బోర్లను అద్దెకు ఇస్తున్నారు. ట్యాంకరు రూ. 500 వరకు తీసుకుంటు న్నారు. హైదరాబాద్ లోని కాలనీలకు వెళ్లే మార్గాలు, పారిశ్రామిక వాడలున్న ప్రాంతాల్లో చెరువుల కింద ఈ వ్యాపారం జోరుగా ఉంది. పటాన్ చెరువు, హత్నూరు, జిన్నారం, అమీన్ పూర్, మియాపూర్, నాచారం, ఐడీఎల్ బొల్లారం, దుండిగల్, ఘట్ కేసర్, ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాలు, నాగోల్ బండ్లగూడ తదితర ప్రాంతాల్లో నీటి వనరుల దిగువ, ఎగువ ప్రాంతాల్లో అక్రమ రవాణా జరుగుతోంది నీటి ట్యాంకర్లకు అనుమతులుండవు, వాటి నంబర్ ప్లేట్లు కూడా అస్పష్టంగా ఉంటాయి.

**మట్టి కొట్టుకుపోతున్న రోడ్లు**

నీటి అక్రమ రవాణాకు కొందరు ఏకంగా లక్ష లీటర్లు పట్టే ట్యాంకర్లను వినియోగిస్తున్నారు. పదివేల లీటర్ల ట్యాంకర్ కు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అవసరార్థుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారు. 20 వేల లీటర్ల ట్యాంకర్ కు రూ.10 వేలు, లక్ష లీటర్ల ట్యాంకర్ కు రూ.40 వేలు వసూలు చేస్తు న్నారు. బల్క్ డ్రగ్, ఫార్మా, రసాయన పరిశ్రమలకు రోజుకు 23 లక్షల లీటర్ల నీటి అవసరాలు ఉంటున్నాయి. మిషన్ భగీరథ ద్వారా నీరందని ప్రాంతాల్లో అక్రమ వ్యాపారానికి డిమాండ్ అధికంగా ఉంది. కాలనీలు, హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్ ఉన్న చోట ఐదు వేల లీటర్ల ట్యాంకర్ కు రూ. వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. పాల ట్యాంకర్లు. ఇంధన ట్యాంకర్లతో రవాణా చేస్తుండటంతో చెరువు కట్టలు, రోడ్లు ధ్వంసమైపోతున్నాయి.

**ఇవీ నిబంధనలు..**

నీటి రవాణా అనేది వాల్టా చట్టం పరిధిలోకి వస్తుంది. ఈ చట్టం ద్వారా ఏర్పడే కమిటీలో భూగర్భ జలవనరుల శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, మైనింగ్, పోలీస్, నీటి పారుదల, అటవీ శాఖలకు చెందిన అధికారులు సభ్యులుగా ఉంటారు. నీటి అక్రమ రవాణాను ఈ కమిటీ అరికట్టాల్సి ఉంటుంది. వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకోవాలన్నా గ్రామ పంచాయతీ అనుమతి తప్పనిసరి. వాణిజ్య వినియోగానికి భూగర్భ జలాలను వాడుకోవాలంటే భూగర్భ జలవనరుల శాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండానే అక్రమ వ్యాపారం కొనసాగుతోంది.




# మాకు మెట్రో ఇవ్వరా..?

(మొదటిపేజీ తరువాయి)

పీజేఆర్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. ఎన్నికలపుడే రాజకీయాలని ఈ మూడేళ్ళు డెవలప్ మెంట్ కోసం కలుస్తూనే ఉంటామన్నారు. రాష్ట్రానికి మోదీ ఏమిచ్చారో బీజేపీ నేతలు చెప్పాలి.మీకు 8 మంది ఎంపీ సీట్లు ఇచ్చారు. చిన్న చిన్న నగరాలు అద్భుతంగా మెట్రోను విస్తరించుకుంటున్నాయి.. మా నివేదికలో ఏమైనా లోపాలు ఉన్నాయా?. మేం ఏ పాపం చేశాం. రెండో స్థానంలో ఉన్న మెట్రో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. 30 35 సార్లు ఢిల్లీ వెళ్లి అందర్నీ కలిశా.. రేపు అమిత్ షా రాష్ట్రానికి వస్తున్నారు. మళ్లీ విజ్ఞప్తి చేస్తాం.మూసీ, మెట్రో పూర్తయితే హైదరాబాద్ ప్రపంచ నగరంగా మారబోతుందని సీఎం అన్నారు.

**కంచ గచ్చిబౌలి అభివృద్ధి ఆగదు**

ఎన్ని ఆటంకాలు ఎదురైనా వాటిని అధిగమించి కంచ గచ్చిబౌలిని అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇక్కడి భూముల్లో అభివృద్ధి ఆటంకాలు తాత్కాలికమేనని అన్నారు. కంచ గచ్చిబౌలిలో కొత్త కంపెనీల ఏర్పాటుతో 5 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. పీజేఆర్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు పి.జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆయన పోరాటాల వల్లే హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి జలాలు వచ్చాయని తెలిపారు. ఎప్పుడు పిలిచినా పలికే పేదల నాయకుడిగా ఎంతో గొప్ప పేరు సంపాదించారని చెప్పారు. హైదరాబాద్ దోమలగూడలోని పీజేఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజీగా కనిపించేదన్నారు. 'పీజేఆర్ కృషితోనే హైటెక్ సిటీ గచ్చిబౌలికి మంజూరైంది. హైటెక్ సిటీకి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన పునాది రాయి వేస్తే, చంద్రబాబు దాన్ని మరోస్థాయికి తీసుకెళ్లారు అని సీఎం గుర్తు చేశారు.

**ప్రపంచ నగరాలతో పోటీ**

'ప్రపంచంలోని నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలి. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో హైదరాబాద్ పోటీపడుతోంది. ఎంత మంది రాక్షసులు అడ్డుపడినా మా యజ్ఞం ఆగదు. రైజింగ్ తెలంగాణ2047 లక్ష్యంతో మాతో అందరూ కలిసి వస్తున్నారు. 3 లేయర్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని విభజించాలనుకున్నాం. రాబోయే 100 రోజుల్లో కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతాయి అని సీఎం స్పష్టం చేశారు. కాలుష్యం కారణంగా నేడు దిల్లీలో నివసించలేని పరిస్థితి ఏర్పడింది. దేశ రాజధానిలో నివసించలేని పరిస్థితి వచ్చిందంటే పాలకులు సరైన ప్రణాళిక లేకపోవడమే కారణం. వర్షాకాలంలో వానలు కురిస్తే చెన్నై నగరం అతలాకుతలమవుతోంది. మరోవైపు బెంగళూరు నగరం ట్రాఫిక్‌లో చిక్కుకుంటోంది. దిల్లీ, చెన్నై, బెంగళూరు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి' అని సీఎం అన్నారు.

**కాలుష్యం తగ్గించేందుకు కార్యాచరణ**

హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు సీఎం. డీజిల్ బస్సులను నగరానికి అవతలకు పంపించే చర్యలు తీసుకున్నామని తెలిపారు. నగరంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తామన్నారు. ఎలక్ట్రిక్ కార్లు, ఆటోలు కొంటున్న వారికి పన్ను లేకుండా చేస్తున్నామని చెప్పారు. నగరంలోని నాలాలు కబ్జాలకు గురవడం వల్లే ముంపు సమస్య తీవ్రత పెరిగిందని, చెరువుల్లో అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చి వేసిందని గుర్తు చేశారు. వరద నీళ్లు వెళ్లేందుకు చెరువుల్లేకుండా కొందరు కబ్జాలు చేశారని మండిపడ్డారు. బతుకమ్మకుంటను బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించుకుంటే, కబ్జా నుంచి విడిపించామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# మహా న్యూస్ ఛానెల్ ఆఫీసుపై బీఆర్ఎస్ దాడి

## ఖండించిన తెలుగు రాష్ట్రాల సీఎంలు, కీలకనేతలు

### పీసీసీ చీఫ్, మంత్రులు, నేతలు, జర్నలిస్ట్ సంఘాల ఖండన
### దాడి కేసులో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అరెస్ట్

**హైదరాబాద్, మహా:** మహా న్యూస్ ఛానెల్ ఆఫీసుపై శనివారం మధ్యాహ్నం బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంత మంది వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేశారు. 40మంది గులాబీ కార్యకర్తలు ఆఫీసు ఎదుట ఉన్న రెండు కార్లను ధ్వంసం చేశారు. పెద్ద పెద్ద రాళ్లను కార్లపై వేశారు. కార్లను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ వెంటనే మరికొంత మంది ఆఫీసుపై రాళ్లు వేశారు. ఆఫీసులోకి దూసుకెళ్లిన బీఆర్ఎస్ కార్యకర్తలు.. ఆఫీసులోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. కంప్యూటర్లు పగలగొట్టారు. రాళ్లు, కర్రలు, రాడ్లతో విధ్వంసం చేశారు. అద్దాలు ధ్వంసం చేశారు. ఆఫీసులో బీభత్సం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ అంశంపై సిట్ విచారణ కొనసాగుతుండగా, ఈ విచారణకు సంబంధించి.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోని అంశాలపై మహా న్యూస్ ఛానెల్ లో కథనాలు ప్రసారం అయ్యాయి. ఈ కథనాలు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, అప్పటి మంత్రి కేటీఆర్ కు వ్యతిరేకంగా ఉన్నాయంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ దాడికి పాల్పడినట్లు.. మహా న్యూస్ ఛానెల్ యాజమాన్యం స్పష్టం చేసింది. మీడియాలో వచ్చిన కథనాలపై అభ్యంతరాలు ఉంటే కూర్చుని మాట్లాడుకుందాం అని ఉద్యోగులు, సిబ్బంది చెప్పినా వినకుండా.. అత్యంత దారుణంగా.. కిరాతకంగా దాడి చేసినట్లు మహాన్యూస్ యాజమాన్యం తెలిపింది.



**ఖండించిన ప్రముఖులు**

మహాన్యూస్ ఛానెల్ పై దాడిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు ఖండించారు. మీడియాపై దాడులు హేయమన్నారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి తదితరులు దాడిని తీవ్రంగా ఖండించారు. మీడియా స్వేచ్ఛను దాడులతో అణిచివేస్తాం అనుకుంటే పొరపాటు అంటూ చెప్పుకొచ్చారు. భౌతిక దాడులు సరికాదన్నారు. మహా న్యూస్ ఛానెల్ ఆఫీసులో బీఆర్ఎస్ కార్యకర్తల విధ్వంసంపై జర్నలిస్ట్ సంఘాలు ఖండించాయి. కాగా దాడి కేసులో బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ను శనివారం రాత్రి అరెస్ట్ చేశారు.



## ప్రభుత్వ సలహాదారుగా నోరి దత్తాత్రేయుడు

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం


**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ వైద్యంలో ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడుని రాష్ట్ర ప్రభుత్వం సలహదారుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.కాగా, ప్రఖ్యాత రేడియేషన్ ఆంకాలజిస్ట్, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ నోరి దత్తా త్రేయుడుసు ప్రసిద్ధ భారతీయ వైద్యుడు, అమెరికాలోని అగ్రశ్రేణి వైద్యుల్లో ఒకరిగా ఉన్నారు. మహిళలలో వచ్చే క్యాన్సర్ వ్యాధులను నయం చేయడంలో సిద్ధహస్తులు.

## నాగార్జున రియల్ హీరో

### ఎన్ కన్వెన్షన్ ను కూల్చినా నాగార్జున చెరువు కోసం రెండెకరాలు ఇచ్చాడు
### సీఎం రేవంత్ కామెంట్స్ వైరల్



**మహా:** టాలీవుడ్ స్టార్ హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ హాల్ ను హైడ్రా అధికారులు కూల్చేశారని.. ఆ తర్వాత నాగ్ రియలైజ్ అయి తమ్మిడికుంట చెరువుకోసం రెండెకరాలు ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పీజేఆర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. హైదరాబాద్ ఒకప్పుడు ఎంతో అందంగా ఉండేదన్నారు. ఇష్టారీతిన చెరువులు, నాలాలు కబ్జా చేయడం వల్ల నీటిలో మునిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని క్లియర్ చేయడానికే తాము హైడ్రాను తీసుకొచ్చినట్టు ఆయన వివరించారు. నాగార్జునలాగా అందరూ ముందుకు రావాలి. ఆయన నగర అభివృద్ధి కోసం రెండెకరాలు ఇచ్చి తాను రియల్ హీరోను అని నిరూపించుకున్నాడు. హైడ్రా వచ్చిన తర్వాత కబ్జా చేయాలంటే చాలా మంది భయపడుతున్నట్టు రేవంత్ వెల్లడించారు. రేవంత్ రెడ్డి నాగార్జున గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## మంత్రి అడ్లూరికి తప్పిన ప్రమాదం

- ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదం
- రన్నింగ్‌లోనే ఊడిపోయిన టైరు.. కారు స్వల్పంగా ధ్వంసం

**జగిత్యాల, మహా:** తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు తృటిలో రోడ్డు ప్రమాదం తప్పింది. జగిత్యాల జిల్లా పర్యటనలో భాగంగా కోరుట్ల, మెట్ పల్లిలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి తిరుగు ప్రయాణంలో ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. మెట్‌పల్లి నుండి తన కాన్వాయ్‌తో వస్తున్న మంత్రి ఆరపేట వద్దకి రాగానే వేరే కారు వచ్చి కాన్వాయ్‌లోని కారుని బలంగా ఢీకొట్టింది. దీంతో మంత్రి ప్రయాణిస్తున్న ల్యాండ్ క్రూజర్ కారు ముందు టైరు ఊడిపోయింది. అయితే మంత్రి అడ్లూరికి ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో అభిమానులు, కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే వేరే కారులో మంత్రి లక్ష్మణ్ కుమార్ ధర్మపురిలోని క్యాంపు కార్యాలయానికి వెళ్లిపోయారు.

# అధ్యక్ష పదవి అడుగుతా

- ఇస్తారా లేదా అనేది పార్టీ ఇష్టం
- ఇవ్వరని తెలుసు.. ప్రయత్నం చేస్తే తప్పేముంది?
- నామినేషన్ వేయ్యాలా వద్దా అని ఆలోచిస్తా
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్:** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవిపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కూడా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి అడుగుతానని స్పష్టం చేశారు. అధ్యక్ష పదవి ఇస్తారా లేదా అనేది పార్టీ అగ్రనేతల ఇష్టమని చెప్పారు. తాను 1995 నుంచి 2009 వరకు హిందూవాహినిలో ఫిజికల్ చీఫ్‌గా పనిచేశానని గుర్తుచేశారు. శనివారం బీజేపీ కార్యాలయంలో రాజాసింగ్ మీడియాతో మాట్లాడారు. 2009లో మున్సిపల్ కార్పొరేషన్ టికెట్‌ని తాను మంగళ్‌హట్ డివిజన్ నుంచి బీజేపీ నేతలను అడిగితే ఇవ్వలేదని అన్నారు. బీజేపీ నుంచి టికెట్ రాకపోవడంతో టీడీపీ తరపున టికెట్ తీసుకొని ఆ సమయంలో కొట్లాడానని, ఆ తర్వాత టీడీపీ కార్పొరేటర్‌గా గెలిచానని గుర్తుచేసుకున్నారు.

**అందులో తప్పేమున్నది..?**

2014లో భారతీయ జనతా పార్టీలో చేరిన తర్వాత గోషామహల్ అసెంబ్లీ నుంచి తాను మొదటిసారి ఎమ్మెల్యే అయ్యానని రాజాసింగ్ తెలిపారు. హిందూ ధర్మసేవా గురించి ఎన్నోసార్లు మాట్లాడనని చెప్పారు. 1998, 2010, 2012లో ఎన్నోసార్లు జైలుకి వెళ్లానని అన్నారు. ఎమ్మెల్యే అయిన తర్వాత కూడా 77 రోజులు తాను జైలుకి వెళ్లానని వెల్లడించారు. హిందూ రాష్ట్రం, హిందూ ధర్మరక్షణ గోరక్షణ ఇదే తన సంకల్పమని ఉద్ఘాటించారు. తనకు బీజేపీ అధ్యక్ష పదవి ఇవ్వరని తనకు కూడా తెలుసు కానీ ప్రయత్నం చేస్తే తప్పేముందని అన్నారు. నామినేషన్ డేటు డిక్లేర్ అయిన తర్వాత దీనికి సంబంధించి తాను కూడా నామినేషన్ వేయ్యాలా వద్దా అని ఆలోచిస్తానని రాజాసింగ్ పేర్కొన్నారు

# పసుపు బోర్డును ఎన్నిసార్లు ప్రారంభిస్తరు

## అమిత్ షాకు విషయం చెప్పకుండా ఎంపీ తీసుకువస్తున్నారేమో

### పసుపు మద్దతు ధర ప్రకటించాలి.. కాంగ్రెస్ పార్టీని నిలబెట్టిందే మహిళలు
### ఆ పార్టీ నేతలే మహిళలను అవమానిస్తున్నరు
### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, మహా :** నిజామాబాద్ లో పసుపు బోర్డును ఇదివరకే రెండుసార్లు ప్రారంభించారని.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పుడు మూడోసారి ప్రారంభించేందుకు వస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కూకట్ పల్లి, శేరిలింగంపల్లి, పటాన్ చెరు, యాకుత్ పురా నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు, యువకులు శనివారం కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, పసుపు బోర్డుకు పదే పదే ప్రారంభోత్సవాలు చేయడం కాదు.. ఎన్డీఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. పసుపు బోర్డుకు ఇదివరకే ప్రారంభోత్సవాలు చేసిన సంగతి ఎంపీ అర్వింద్ కేంద్ర హోం మంత్రికి చెప్పకపోవచ్చన్నారు. నిజామాబాద్ లోనే పసుపునకు క్వింటాల్ కు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించి వెళ్లాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదు కాబట్టే మొన్నటి బడ్జెట్ లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. నిజామాబాద్ జిల్లా రైతులు సంతోష పడేలా అమిత్ షా మద్దతు ధరపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటోన్న సమస్యలను తెలంగాణ జాగృతి నుంచి లేవనెత్తుతుంటే కాంగ్రెస్ పార్టీ ఉలిక్కి పడుతోందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు, మహిళలు, అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందుకే మహిళలను తక్కువ చేసి కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఈ రోజు కాంగ్రెస్ పార్టీ బతికి బట్టకట్టింది అంటే అది మహిళల వల్లనే అన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఇందిరా గాంధీ, సోనియా గాంధీలే నిలబెట్టారని తెలిపారు. మహిళల గురించి జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలే కాంగ్రెస్ పార్టీ విధానమా అని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ను ప్రశ్నించారు. మహిళలను తక్కువ చేసి మాట్లాడుతున్న జగ్గారెడ్డిని ఆయన భార్య, కూతురే సరి దిద్దాలన్నారు. బీసీల రిజర్వేషన్ల పెంపు బిల్లు కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్ లో ఉందని.. ఆ బిల్లును పాస్ చేస్తారా లేదా అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**యువత రాజకీయాల్లోకి రావాలి**

యువత రాజకీయాల్లోకి రావాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. జయశంకర్ సార్, కేసీఆర్ ఆలోచనల్లోంచి తెలంగాణ జాగృతి ఆవిర్భవించిందని అన్నారు. విద్యార్థులు, యువతకు ఎలాంటి సమస్యలున్నా వారి తరపున తెలంగాణ జాగృతి ఉద్యమిస్తుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడటం మినహా ప్రజల కోసం చేసిందేమి లేదన్నారు. జై తెలంగాణ అనని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. ఈ సందర్భంగా రోషన్, అజయ్ నాయక్, పంకజ్ షిండే, వికాస్ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు తెలంగాణ జాగృతిలో చేరారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ జాగృతితో కలిసి పని చేస్తాం : సీపీఐ ఎంపీ సందోష్**

తెలంగాణ జాగృతితో సీపీఐ సాంస్కృతిక విభాగం యువ కళావాహిని కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని కేరళకు చెందిన ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సందోష్‌కుమార్ తెలిపారు. శనివారం బంజారాహిల్స్ లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఆమెతో సందోష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వివిధ దేశాల్లో యువ కళావాహిని జాగృతి కలిసి పని చేస్తాయన్నారు. తన నివాసానికి వచ్చిన సందోష్ ను ఎమ్మెల్సీ కవిత ఘనంగా సత్కరించారు.

## వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

గ్రామ రెవెన్యూ సేవకుల (వీఆర్ఏ) వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వీఆర్ఏ జేఏసీ నాయకులు శనివారం ఎమ్మెల్సీ కవితను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, రాష్ట్రంలో 20,555 మంది వీఆర్ఏలు ఉండగా కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 16,758 మందికి వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతుండగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. 61 ఏళ్ల వయసు పైబడిన 3,797 మంది వీఆర్ఏల వారసులకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

EDITORIAL సంపాదకీయం

# ట్యాపింగ్ తీగల్లో..
# కేసీఆర్ ఫిక్స్



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

**ట్యాపింగ్ తీగల చుట్టూ తెలంగాణ రాజకీయ నేతల వ్యూహాలు తిరుగుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు, కల్వకుంట్ల కుటుంబంలో అంతర్గత విభేదాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడు వ్యూహం బీఆర్ఎస్‌ను రక్షణాత్మక స్థితిలో నిలిపాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు, మొయినాబాద్ ఫాంహౌజ్ లో నలుగురు ఎమ్మెల్యేల కేసు గులాబీ పెద్దల అరెస్ట్ లకు దారితీస్తుందా? ప్రభాకర్ రావు కస్టడీ తర్వాత కేసు మరిన్ని మలుపులు తీసుకునే అవకాశముందా? అనే చర్చ జరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ప్రజలు నమ్ముతుండగా, ఈ అంశంలో బిఆర్ఎస్ కు సానుభూతి కనబడడం లేదు. దీనిని నిరూపించగలిగితే ఈ కేసులో ప్రభుత్వ పెద్దగా కేసీఆర్ ఫిక్స్ అవుతారు. కానీ నిరూపించడం పెద్ద సవాల్ అన్న విశ్లేషణలున్నాయి. కవిత రాజకీయ కార్యకలాపాలు ఆమె స్థానాన్ని బలోపేతం చేసే దిశగా ఉండగా, బిఆర్ఎస్ పై ఒత్తిడిపెంచుతున్నాయి.**

*- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్*

**650మందికి పైగా ఫోన్లు ట్యాప్ అయినట్లు చెబుతుండగా, ఇది దేశంలోనే పెద్ద సంచలనం. నిరూపించగలిగితే ఇది అనేకమంది పెద్దల రాజకీయ జీవితాన్నే ప్రమాదంలో పడేసే అవకాశాలున్నాయి. ఫోన్ ట్యాపింగ్ ద్వారా అనేకమంది నేతలను వేధించిన ఉదాహరణలు ప్రజల కళ్ళముందు ఉండగా, కొండా విశ్వేశ్వరరెడ్డి లాంటి నేతలు బెంగుళూరు లాంటి ప్రాంతాలకు వెళ్ళి రెండు వారాలు దాక్కోవడం అప్పటి ప్రభుత్వ యంత్రాంగం వేధింపులకు నిదర్శనంగా చెప్పవచ్చు.**

తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కీలకదశకు చేరింది. నాడు ఎస్ ఐబి చీఫ్ గా ఉన్న ప్రభాకరరావును విదేశాల్లో ఉన్నా.. చెప్పినట్లుగా పట్టుబట్టి రప్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితులుగా ఉన్న వారిని చట్టపరిధిలోనే శిక్షించాలన్న పట్టుదలతో ఉన్నట్లు కనబడుతోంది. ప్రభాకరరావు ఇప్పటి వరకు పోలీసులకు సహకరించకపోయినా, దొరికిన ఆధారాలు.. వాంగ్మూలాలు ప్రధానంగా కేసీఆర్ చుట్టూ ఉచ్చు బిగించే అవకాశముందని న్యాయనిపుణులు అంటున్నారు. ఈ కేసులో నాలుగు సార్లు ప్రభాకర్ రావు విచారించినా తమకు సహకరించడం లేదని సుప్రీంకోర్టును సిట్ ఆశ్రయించే అవకాశాలున్నాయి. ప్రభాకర్ రావుకు ఉన్న రిలీఫ్ ని వెంటనే రద్దుచేసి కస్టోడియల్ ఎంక్వయిరీకి అనుమతి ఇవ్వాలని సుప్రీంను సిట్ కోరే అవకాశం ఉంది.. ఇందుకు సంబంధించి పావులను సిట్ కదుపుతోంది. అయితే ప్రభుత్వ పెద్దల ఆదేశాలు లేకుండా ట్యాపింగ్ కు పాల్పడే అవకాశాలు లేదు. 650మందికి పైగా ఫోన్లు ట్యాప్ కాగా, ఇది దేశంలోనే పెద్ద సంచలనం. నిరూపించగలిగితే ఇది అనేకమంది గత ప్రభుత్వ పెద్దల రాజకీయ జీవితాన్నే ప్రమాదంలో పడేసే అవకాశాలున్నాయి. ఫోన్ ట్యాపింగ్ ద్వారా అనేకమంది నేతలను వేధించిన ఉదాహరణలు ప్రజల కళ్ళముందు ఉండగా, కొండా విశ్వేశ్వరరెడ్డి లాంటి నేతలు బెంగుళూరు లాంటి ప్రాంతాలకు వెళ్ళి రెండు వారాలు దాక్కోవడం అప్పటి ప్రభుత్వ యంత్రాంగం వేధింపులకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఇపుడు ప్రతిపక్షంలో ఉన్న నేతలు నాటి వేధింపులు మరిచిపోతారు. కానీ దెబ్బ తగిలిన వారు మరిచిపోలేదు. ఫలితంగా తప్పులన్నీ తెరమీదకు తెచ్చేసరికి.. తప్పు చేసిన నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితి కనబడుతోంది.

నలుగురు ఎమ్మెల్యేలను బిజెపి కొనుగోలు చేయనున్నదంటూ మునుగోడు ఉప ఎన్నికల ముందు కేసీఆర్ చేసిన హంగామా, బిజెపి సంస్థాగత ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ ను అరెస్ట్ చేసేందుకు చేసిన ప్రయత్నాలు అందరి కళ్ళముందు ఉన్నవే. ఆడియో టేపులు.. వీడియో టేపులు దేశమంతా పంపుతున్నట్లు కేసీఆర్ పెట్టిన సుదీర్ఘ ప్రెస్ మీట్స్, సృష్టించిన ఉత్కంఠ రాజకీయాలు అప్పట్లో హాట్ టాపిక్ గా మారాయి. నలుగురు ఎమ్మెల్యేలు పైలట్ రోహిత్ రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డి, రేగా కాంతారావులను కొనుగోలు చేసేందుకు బిజెపి స్వామీజీలను రంగంలోకి దింపి ప్రయత్నం చేస్తున్నదంటూ కేసీఆర్ మీడియా సమావేశాలు నిర్వహించి సంచలనాలకు కారణమయ్యారు. ఇపుడీ కేసులో ఫోన్ ట్యాపింగ్ మూలాలు ఉండడంతో సిట్ రంగంలోకి దిగింది. ఈ కేసును సిబిఐకి అప్పగించాలని బిజెపి డిమాండ్ చేస్తున్నది. మునుగోడు ఉప ఎన్నికలకు ముందు నలుగురు ఎమ్మెల్యేలను ప్రజాస్వామ్య విజేతలుగా ప్రభుత్వ రక్షకులుగా ప్రకటించిన కేసీఆర్ తర్వాత గాలికొదిలేశారు. దీంతో ఆ నలుగురు ఈ అపప్రదతోనే ఓడిపోయారు. ఇపుడీ కేసుపై మళ్ళీ కదలిక వచ్చింది. మొయినాబాద్ ఫాంహౌజ్ కేసు పై తీగలాగితే డొంక కదలుతోంది. త్వరలో ఈ కేసులో సంచలనాలు చోటు చేసుకోవడం ఖాయంగా కనబడుతోంది. మునుగోడు చుట్టే ట్యాపింగ్ రచ్చతో పాటు బిజెపి కేంద్ర నేతలకు అరెస్ట్ చేయడానికి చేసిన ప్రయత్నాలు.. ఇపుడు తిరిగి వారికే చుట్టుకునే సంకేతాలు కనబడుతున్నాయి. నలుగురు ఎమ్మెల్యేలతో కలిసి కేసీఆర్ నడిపిన రాజకీయం మునుగోడు విజయాన్ని అందించినా, ఆ నలుగురి పొలిటికల్ కెరీర్ ను డేంజర్ లో పడేసింది. ఇపుడు ట్యాపింగ్ కేసు విచారిస్తున్న క్రమంలో.. ఆ కేసు తాలూకు పరిణామాలు సంచలనంగా మారనున్నాయి. కల్వకుంట్ల కవిత తన జాగృతి ద్వారా బిఆర్ఎస్ పెద్దలను జాగృతం చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు కనబడుతోంది. కవిత ప్రతిరోజూ చేస్తున్న కార్యక్రమాలు, కేంద్రమంత్రులు, జాతీయ నేతలను ఆహ్వానించడం ద్వారా మీడియా దృష్టిని ఆకర్షిస్తూ తన ఉద్యమాలకు, భవిష్యత్ కార్యక్రమాలకు మద్దతు కూడగట్టే యత్నాలు అచ్చం కేసీఆర్ జాతీయపార్టీని తలపిస్తున్నాయి. కేసీఆర్ జాతీయపార్టీని ప్రకటించిన తర్వాత ప్రతిరోజూ మహారాష్ట్ర అనో, ఒడిస్సా అనో, ఉత్తర ప్రదేశ్ అనో ఎక్కడో ఒక దగ్గర నుండి ఎవరో నేతలు వచ్చి కలిసేవారు. దేశ్ కీ నేత కేసీఆర్ అంటూ పతాక శీర్షికలు, జాతీయ మద్దతు పెరుగుతుందన్న కథనాలు వచ్చేవి. ఇపుడు కవిత కూడా ఇదే బాటలో పయనిస్తూ వార్తల్లో నిలుస్తోంది. కల్వకుంట్ల కవిత కేసీఆర్ కు రాసిన లేఖ లీక్ కావడం, ఆ తర్వాత దెయ్యాలున్నారంటూ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని ఆమె ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా బీఆర్ఎస్‌లో తన ప్రభావాన్ని పెంచుకోవాలనే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్ గతంలో జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్‌ను ఒక శక్తిగా నిలపాలని ప్రయత్నించారు, కానీ ఇటీవలి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి దానిని వెనక్కు లాగేసింది. లోక్ సభ ఎన్నికల్లో సున్నా సీట్లతో చరిత్ర ఎరుగని దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది.



**నలుగురు ఎమ్మెల్యేలను బిజెపి కొనుగోలు చేయనున్నదంటూ మునుగోడు ఉప ఎన్నికల ముందు కేసీఆర్ చేసిన హంగామా, బిజెపి సంస్థాగత ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ ను అరెస్ట్ చేసేందుకు చేసిన ప్రయత్నాలు అందరి కళ్ళముందు ఉన్నవే. ఆడియో టేపులు.. వీడియో టేపులు దేశమంతా పంపుతున్నట్లు కేసీఆర్ పెట్టిన సుదీర్ఘ ప్రెస్ మీట్స్, సృష్టించిన ఉత్కంఠ రాజకీయాలు అప్పట్లో హాట్ టాపిక్ గా మారాయి. నలుగురు ఎమ్మెల్యేలు పైలట్ రోహిత్ రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డి, రేగా కాంతారావులను కొనుగోలు చేసేందుకు బిజెపి స్వామీజీలను రంగంలోకి దింపి ప్రయత్నం చేస్తున్నదంటూ కేసీఆర్ మీడియా సమావేశాలు నిర్వహించి సంచలనాలకు కారణమయ్యారు. ఇపుడీ కేసులో ఫోన్ ట్యాపింగ్ మూలాలు ఉండడంతో సిట్ రంగంలోకి దిగింది.**

కవిత ఇటీవలి వ్యాఖ్యలు ముఖ్యంగా తన సోదరుడు కేటీఆర్ ను టార్గెట్ చేసినట్లు ఉంటున్నాయి. కేసీఆర్ కు అసలైన రాజకీయ వారసురాలిని తానేనని కవిత భావిస్తున్నారు. తనకు పార్టీలో జరిగిన అవమానాలకు ప్రతీకారం తీర్చుకోవాలన్న పట్టుదల కవితలో కనబడుతోంది. కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని, పార్టీలో నాయకత్వ మార్పు కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ ధర్నా కోసం మద్దతు కూడగట్టడం ద్వారా ఆమె పార్టీపై మరింత ఒత్తిడి పెంచే వ్యూహాన్ని రచించింది. అయితే జూన్ మాసంలో కేసీఆర్ కుటుంబానికి చెందిన ముగ్గురు నేతలు విచారణను ఎదుర్కోగా, వరుస కేసులు.. విచారణలు కేసీఆర్ కుటుంబానికి ఇబ్బందికరంగా మారాయి. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి, కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్, మరియు ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు వీరి రాజకీయ ప్రతిష్టకు గండి కొట్టాయి. అలాగే, కవిత మరియు కేటీఆర్ మధ్య అంతర్గత విభేదాలు పార్టీని బలహీన పరిచాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు ఈ బలహీనతను ఉపయోగించుకుని బీఆర్ఎస్‌ను మరింత ఒత్తిడిలో పెడుతోంది.

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై ప్రజలలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. నేతలపై వేధింపులు, గతంలో ఎదిరించిన వారిని వెంటాడి వేధించిన ఘటనలు ఇపుడు తాను నేర్పిన విద్యయే అన్న సామెతనే గుర్తుచేస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని నేతలు ఆరోపణలు చేస్తుండగా, ప్రజలు కూడా ట్యాపింగ్ ద్వారా అనేకమందిని టార్గెట్ చేశారని నమ్ముతున్నారు. దీంతో ఈ ఎపిసోడ్ తో గులాబీపార్టీకి నష్టమే. సమర్థించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే ఫోన్ ట్యాపింగ్ పై ఆరోపణలు చేశారని మహాన్యూస్ మీడియాసంస్థపై బిఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేయడం అసహనానికి పరాకాష్టగా చర్చ జరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నేతల అరెస్ట్ లు జరిగే అవకాశాలు కనబడుతున్నాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గేర్ మార్చి దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా ఆచితూచి వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్ గాంధీభవన్ వేదికగా పనితీరే గీటురాయని నేతలకు, మంత్రులకు తేల్చిచెప్పారు. పనిచేయకుంటే ఎవరినీ వదిలేది లేదని స్పష్టం చేశారు. ఓ వైపు రాజకీయంగా పట్టు బిగిస్తూ రైతుభరోసా పథకాన్ని పకడ్బందీగా పట్టాలెక్కించడం ద్వారా రైతునేస్తంగా మారారు. తొమ్మిదిరోజుల్లో తొమ్మిదివేల కోట్ల భరోసాతో రైతులలో సానుకూల వాతావరణానికి బీజం వేసుకున్నారు.

**కల్వకుంట్ల కవిత తన జాగృతి ద్వారా బిఆర్ఎస్ పెద్దలను జాగృతం చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు కనబడుతోంది. కవిత ప్రతిరోజూ చేస్తున్న కార్యక్రమాలు, కేంద్రమంత్రులు, జాతీయ నేతలను ఆహ్వానించడం ద్వారా మీడియా దృష్టిని ఆకర్షిస్తూ తన ఉద్యమాలకు, భవిష్యత్ కార్యక్రమాలకు మద్దతు కూడగట్టే యత్నాలు అచ్చం కేసీఆర్ జాతీయపార్టీని తలపిస్తున్నాయి.**

**ఫోన్ ట్యాపింగ్ జరిగిందని నేతలు ఆరోపణలు చేస్తుండగా, ప్రజలు కూడా గత ప్రభుత్వం ట్యాపింగ్ ద్వారా అనేకమందిని టార్గెట్ చేశారని నమ్ముతున్నారు. దీంతో ఈ ఎపిసోడ్ తో గులాబీపార్టీకి నష్టమే. సమర్థించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే ఫోన్ ట్యాపింగ్ పై ఆరోపణలు చేశారని మహాన్యూస్ మీడియాసంస్థపై బిఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేయడం అసహనానికి పరాకాష్టగా చర్చ జరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నేతల అరెస్ట్ లు జరిగే అవకాశాలు కనబడుతున్నాయి.**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గేర్ మార్చి దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా ఆచితూచి వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్ గాంధీభవన్ వేదికగా పనితీరే గీటురాయని నేతలకు, మంత్రులకు తేల్చిచెప్పారు. పనిచేయకుంటే ఎవరినీ వదిలేది లేదని స్పష్టం చేశారు. మంత్రి వర్గ విస్తరణ నాటి నుండీ ముఖ్యమంత్రి రేవంత్ తీరులో స్పష్టమైన మార్పు కనబడుతోంది.**

## భారత్‌ని చుట్టుముట్టేలా చైనా ప్లాన్

చైనాపాకిస్తాన్‌బంగ్లాదేశ్ కలిసి దుష్ట పన్నాగాన్ని పన్నుతున్నాయి. భారత్‌ని చుట్టుముట్టేలా ప్లాన్ చేస్తున్నాయి. ఇటీవల ఈ మూడు దేశాలు కలిసి త్రైపాక్షిక సమావేశాన్ని నిర్వహించాయి. చైనా చరిత్రలో తొలిసారిగా బంగ్లాదేశ్, పాకిస్తాన్‌తో త్రైపాక్షిక సమావేశాన్ని నిర్వహించడం భారత్‌కి ఆందోళన కలిగించే విషయం. గతంలో, షేక్ హసీనా అధికారంలో ఉన్న సమయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత అనుకూల వైఖరిని అవలంభించేంది. ఎప్పుడైతే మహ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిందో అప్పటి నుంచి బంగ్లాదేశ్ వ్యాప్తంగా భారత వ్యతిరేక ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు పాకిస్తాన్, చైనాలు భారత్‌కి ఎప్పటి నుంచో శత్రు దేశాలుగా ఉన్నాయి. మీడియా నివేదికల ప్రకారం, ఈ సమావేశంలో చైనా ఉప విదేశాంగ మంత్రి సన్ వీడాంగ్, బంగ్లాదేశ్ తాత్కాలిక విదేశాంగ కార్యదర్శి రుహుల్ ఆలం సిద్ధిఖీ, పాకిస్తాన్ అదనపు విదేశాంగ కార్యదర్శి ఇమ్రాన్ అహ్మద్ సిద్ధిఖీ పాల్గొన్నారు, పాకిస్తాన్ విదేశాంగ కార్యదర్శి అమ్నా బలోచ్ కూడా వీడియో లింక్ ద్వారా చైనాలోని కున్మింగ్ నగరంలో జరిగిన చర్చలలో పాల్గొన్నారు. ఈ త్రైపాక్షిక సమావేశంపై బలోచ్ చైనాను ప్రశంసించారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తో వివిధ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పింది. చైనా, దక్షిణాసియా దేశాలతో పాకిస్తాన్ లోతైన సంబంధాలను కోరుకుంటోందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన అధికారిక ప్రకటనలో తెలిపింది.

- మహా డెస్క్




**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

ANN తెలుగు

మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ | 29-06-2025

జనరల్ వార్తలు | GENERAL NEWS

WWW.MAHAADAILY.COM



# మంచాల మండలంలో అభివృద్ధి పనుల ప్రారంభం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- మహిళా సమాఖ్య అభివృద్ధికి ప్రోత్సాహకం
- ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య
- ఇబ్రహీంపట్నంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మంచాల మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, మంచాల మండలంలోని నోముల, మంచాల, ఎల్లమ్మతండా, సత్తితండ, అంబోత్ తండా, లోయపల్లి గ్రామాలలో సుమారు ఒక కోటి 71 లక్షల 50 వేల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు.

**మహిళా సమాఖ్య అభివృద్ధికి ప్రోత్సాహకం...**

మంచాల మండలం మహిళా సమాఖ్యకు సుమారు రూ.8 కోట్ల 3 లక్షల రూపాయల చెక్కును మహిళా సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎల్లమ్మ తండ గ్రామంలో నూతనంగా నిర్మించిన డ్వాక్రా మహిళా భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళలకు రేవతి సర్కార్ అండగా ఉంటుందని, మరింత అభివృద్ధి చెందే విధంగా మహిళలకు ప్రోత్సాహకాలు అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు.

**ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య...**

ఎల్లమ్మ తండాలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులను కలిసిన ఎమ్మెల్యేకు మొక్కను అందిస్తూ విద్యార్థులు స్వాగతం పలికారు. వారితో సరదాగా ముచ్చటించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాల స్థితిగతులపై ఆరా తీశారు. పాఠశాలకు కావలసిన సాయ సహకారాలు అందిస్తానని ఉపాధ్యాయులకు తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన గ్రామ ప్రజలకు తెలియజేస్తూ, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ బడులలో తమ పిల్లలను చదివించాలని సూచించారు.

**ఇబ్రహీంపట్నంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్....**

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మంచాల మండలం, బోడకొండ గ్రామంలో సపావత్ బిచ్యా నాయక్ పొలంలో 114 మొక్కలు 2.5 ఎకరాలలో నాటడం జరిగింది. ఈ సందర్భంగా జి.అరుణ, ఉద్యాన సహాయ సంచాలకులు మరియు మండల అధికారులు పాల్గొనడం జరిగినది. ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలో 63 ఎకరాలలో 3 మండలాలలో 11 గ్రామాలలో 16 మంది రైతుల పొలాల్లో 3600 మొక్కలు నాటడం జరిగినది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, హనుమంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసిపి కేపీవీ రాజు, డిసిసి ఉపాధ్యక్షులు ముత్యాల రాజశేఖరరావు, మాజీ జెడ్పిటిసి భూపతిగళ్ల మహిపాల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎంపీపీ జయమ్మ, బైరిక రమాకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు భరత్ రెడ్డి, వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.



### ఎమ్మెల్సీ ని మర్యాదపూర్వకంగా
## కలిసిన రాజనాల

**వరంగల్ మహా;** కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ ఎమ్మెల్సీ విజయశాంతి ని వరంగల్ గ్రేటర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి శనివారం హైదరాబాదు బంజారాహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాజనాల శ్రీహరి ఎమ్మెల్సీ విజయశాంతిని మర్యాదపూర్వకంగా కలవడం వరంగల్ తూర్పులో చర్చనీయాంశమైంది. రాజనాల శ్రీహరి వెంట వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్, కుమ్మరి రాజశేఖర్, ముఖ్య నాయకులు, తదితరులు, ఉన్నారు.

# పది లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణలో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దేశంలో 12 లక్షల ఎకరాల్లో ఈ పంట ఉంటే. ఆంధ్రప్రదేశ్లో 6 లక్షల ఎకరాలు, తెలంగాణలో 3 లక్షల ఎకరాల్లో సాగైందని చెప్పారు. మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మించి పోవాలని, ఈ మేరకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. శనివారం ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ లో భాగంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దేవుని ఎర్రవల్లిలో పొల్యుషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి పొలంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆయిల్ పామ్ సాగు కోసం 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇస్తున్నామని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మాత్రం ఎన్ని ఎకరాలు సాగుచేసినా ఇస్తామని హామీ ఇచ్చారు. రైతుకు మొక్కల దగ్గరి నుంచి మార్కెటింగ్ దాకా ప్రభుత్వం సహకరిస్తుందని, ఈ మేరకు ప్రతి జిల్లాకు ఆయిల్ ప్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సిద్దిపేటలో రిఫైనరీ, ప్యాకింగ్ సహా అతి పెద్ద ప్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్యాక్టరీలన్నీ ఫ్రీ పొల్యూషన్ తో పనిచేస్తాయని చెప్పారు. రంగారెడ్డి ప్రాంతంలో కూరగయాలు ఎక్కువగా పండిస్తున్నందున, హైదరాబాద్ కు సమీపంలో మార్కెట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాష, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు గోనె ప్రతాప్ రెడ్డి, దేవర వెంకట్ రెడ్డి, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిధులలో సగం కేంద్రానివే..



**బాలాపూర్ మహా:** ఏ హోదా లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తారు అని ప్రశ్నించారు బడంగ్ పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్ల గూడ రామకృష్ణారెడ్డి. ఇందిరమ్మ ఇళ్లకు నిధులు సగభాగం కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని రామకృష్ణారెడ్డి తెలిపారు. లబ్ధిదారులకు,అధికారులు ఇవ్వవలసిన ఇందిరమ్మ గృహ పత్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎలా ఇస్తారని దీనికి బడంగ్ పేట్ కమిషనర్ సమాధానం చెప్పాలని అన్నారు. బడంగ్ పేట్ కమిషనర్ వ్యవహరిస్తున్న తీరు పై త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళన దిగుతామని హెచ్చరించారు. పాలకుల కోసం కాకుండా,ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. అనంతరం కమిషనర్ సరస్వతి కి వినతి పత్రం అందజేశారు బిజెపి నాయకులు. ఈ కార్యక్రమం లో బిజెపి నేతలు,బడంగ్ పేట్ కార్పొరేషన్ క్లస్టర్ 2 అధ్యక్షుడు రామిడి వీర కర్ణ రెడ్డి,బిజెపి సీనియర్ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.



### అన్నపూర్ణ కేంద్రాల పేరు మార్పు
## మంచి పద్ధతి కాదు

- అన్నపూర్ణ అంటే ఆకలి తీర్చే అమ్మలాగ అని ప్రతితెలుగు వారి సెంటిమెంట్
- ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి

**షాద్ నగర్, మహా:** ప్రతి తెలుగు వారు అనపూర్ణ అనే పేరును ఒక పేరులా కాకుండా ఆకలి తీర్చే అమ్మలాగా భావిస్తారని అలాంటి సెంటిమెంట్ ఉన్న అన్నపూర్ణ కేంద్రాల పేరును మార్చి ఇందిరమ్మ క్యాంటీన్లుగా పేరు పెడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క నిర్ణయం సరైంది కాదని గత కొంతకాలం నుండి హైదరాబాద్ నగరంలో అన్నపూర్ణ భోజన కేంద్రాల ద్వారా ఎంతో మందికి 5 రూపాయలకే భోజనం అందించిందని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి అన్నారు. ఈ రేవంత్ ప్రభుత్వానికి పేర్లు మార్చడం,విగ్రహాలు మార్చడమే సరిపోయిందని ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఇలా పేర్లు మార్చడం సరైంది కాదని ఎమ్మెల్సి నవీన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు.

# మైనర్ బాలికను విక్రయించిన దంపతుల అరెస్ట్

### మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్ రెడ్డి



**ఆదిలాబాద్, మహా** మానవ అక్రమ రవాణా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్టు అదిలాబాద్ డిఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అయన వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నుండి వచ్చి ఆదిలాబాద్ లో ఉంటున్న ఆత్రం నిర్మల , భాపుణ్య దంపతులు ఓ మైనర్ అమ్మాయికి మాయ మాటలు చెప్పి తమ వెంట తీసుకెళ్ళి రాజస్థాన్ లో కరణ్ అనే వ్యక్తికి రూ.10వేల రూపాయాలకు అమ్మేసినట్టు తెలిపారు. అతడు బాలికను లొంగదీసుకుని శారీరక సంబంధం పెట్టుకున్నట్టు వివరించారు.బాలిక కనపడక పోవడంతో కుటుంబసభ్యులు భీంపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో నిర్మల ద్వారా విషయం తెలుసుకున్న అతడు ఆ బాలికను ఆమెకు అప్పగించినట్టు తెలిపారు..బాలిక ఇంటికి చేరుకున్న అనంతరం ఫిర్యాదుతో పోలీసులు మైనర్ పై లైంగిక దాడి చేసిన రాజస్థాన్ యువకుడు కరణ్ పై రేప్ ,పోక్సో కేసు తో పాటు అమ్మిన దంపతులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.శనివారం పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితులను రైల్వేస్టేషన్ లో అదుపులోకి తీసుకొని వారి నుండి సెల్ ఫోన్ తో పాటు రెండు వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.ఈ కార్యక్రమంలో జైనథ్ సీఐ సాయినాథ్, బీంపూర్ ఎస్సై పీర్ సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




### డ్రాపౌట్ పిల్లలను గుర్తించి...
## బడిలో చేర్పించి...

### చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్

**ఆదిలాబాద్, మహా:** డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి . బడిలో చేర్పిస్తున్నామని చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు బడి బయట (స్కూల్ డ్రాప్ అవుట్) పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే కార్యక్రమాన్ని కొనసాగుతుంది. ఇందులో భాగంగా శనివారం అదిలాబాద్ పట్టణంలోనీ పాత గణేష్ సినిమా థియేటర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మార్కెట్ లో అరటి పండ్ల , నిమ్మకాయ సోడా అమ్ముతున్న ఇద్దరు విద్యార్థులను గుర్తించారు. ఈ సందర్భంగా చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల వివరాలను తెలుసుకొని ఏ స్కూల్లో అయితే చదువు మానేశారో అదే పాఠశాలలో చేర్పించడం జరిగిందన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు బాలల పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అంతకుముందు పిల్లలను సిడబ్ల్యుసి కమిటీ ముందు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో షూర్ ఎన్జీవో కోఆర్డినేటర్ వినోద్, అవుట్ రిచ్ వర్కర్ అశ్విని ఉన్నారు.

### గంజాయి మొక్కలను పెంచుతున్న
# వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు



**రాజేంద్రనగర్, మహా :** పూల మొక్కలతో పాటు గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన శంషాబాద్ పోలీసులు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఊట్పల్లి తార్కేశ్వర్ సింగ్ అనే వ్యక్తి గత కొంతకాలంగా తన ఇంట్లో పూల మొక్కలతో పాటు గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వ్యక్తిని అరెస్ట్ చేశారు. నాలుగు నెలల క్రితం ఒక రోజు సాయంత్రం వేళల్లో అతను శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో తన కర్రీ పాయింట్ నుండి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు, కొంతమంది తెలియని వ్యక్తులు ఊట్పల్లి గ్రామంలోని ఓ ఆర్ ఆర్ వంతెన కింద ఏదో నమిలుతున్నట్లు గమనించాడు. దాని కోసం వారు ఖైనీ/ గుట్కా/జర్దా నమిలుతున్నారని భావించి, వారి నుండి కొంత మొత్తాన్ని అడిగి తీసుకున్నాడు. వ్యక్తులు అతనికి కొంత పరిమాణంలో గంజాయి మొక్కల గింజలని ఇచ్చారు. అతను నమిలి, అది , ఖైనీ/ గుట్కా/జర్దా యొక్క నిజమైన రుచి కాదని భావించి, అది సాధారణం కంటే కొంత ఎక్కువ అధికంగా ఉన్నట్లు భావించాడు. ఆ తర్వాత అతను ఆ వ్యక్తులను అడిగి తెలుసుకున్నాడు అతనికి గంజాయి మొక్కల విత్తనాలను ఆ వ్యక్తులు ఇచ్చారు. తన ఇంట్లో గంజాయి మొక్కలను పెంచి తినాలని భావించాడు. తెలియని వ్యక్తుల నుండి కొంత పరిమాణంలో గంజాయిని సేకరించాడు. దానిని పరిశీలించినప్పుడు, ఆ పదార్థంలో కొన్ని విత్తనాలు కలిసి ఉన్నాయని అతను తెలుసుకొని ఆ విత్తనాలను అతను తన ఇంటి పక్కనే నాటాడు. గంజాయి మొక్కలు తన ఇంటి ఆవరణలో లేవని చెప్పలని కొన్ని కూరగాయల మొక్కలను నాటి పెంచి పోషిస్తున్నాడు, గత మూడు నెలలుగా, అతను క్రమం తప్పకుండా గంజాయి అని పిలువబడే గంజాయి మొక్కలకు కూరగాయల మొక్కలతో పాటు రహస్యంగా నీరు పోసి సాగు చేస్తున్నాడు. అతని ఉద్దేశపూర్వక ప్రయత్నాల ఫలితంగా, ఆ ప్రదేశంలో మూడు గంజాయి మొక్కలు కనిపించాయి. అతను వారానికి ఒకసారి పండించిన గంజాయి మొక్కల నుండి ఆకులను తెంపుకుని, వాటిని ఎండబెట్టి, ఎండిన ఆకులను ఖైనీ/గుట్కా/జర్దాతో కలిపి, నమిలేవాడని అతను వెల్లడించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన శంషాబాద్ పోలీసులు



### కొండారెడ్డిపల్లి ఈరా నాగమ్మ గుడి
## నిర్మాణానికి విరాళం

### లక్ష రూపాయల విరాళం అందచేసిన ఎమ్మెల్సి నవీన్ రెడ్డి

**షాద్ నగర్, మహా:** కేశంపేట మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఈరా నాగమ్మ గుడి నిర్మాణానికి కొండారెడ్డిపల్లి గ్రామస్థుల కోరిక మేరకు ఈరా నాగమ్మ గుడి నిర్మాణానికి విరాళంగా లక్ష రూపాయల విరాళాన్ని కొండారెడ్డిపల్లి గ్రామస్తులకు అందజేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు,కాకునూర్ మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు దినేష్ సాగర్, మధు,కర్ణకోట నరేందర్, అమరేందర్ రెడ్డి, మల్లేష్ యాదవ్, ఆంజనేయులు, శ్రీకాంత్ పోమాలపల్లి తదితరులు పాల్గొన్నారు

### నన్ను రెచ్చగొట్టొద్దంటూ పరోక్షంగా జిల్లా
# పార్టీ నేతలకు కొండా వార్నింగ్

- వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల పై 15పేజీలతో కొండా నివేదిక అందజేత
- మీడియా సమావేశంలో జిల్లా పార్టీ నేతలకు రివర్స్ కౌంటర్!
- కొండా వ్యాఖ్యలతో వరంగల్ కాంగ్రెస్ లో కలకలం

**వరంగల్ మహా;** ఇటీవల రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారం పై జిల్లా నేతల తో పాటు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అధిష్టానానికి ఇచ్చిన ఫిర్యాదు పై శనివారం గాంధీ భవన లో కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ సమావేశమైంది. అయితే కమిటీ ఎదుట హాజరైన కొండా మురళి ఊహించని విధంగా ట్విస్ట్ ఇచ్చారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇస్తారని.. పార్టీ ఆయన పై చర్యలు తీసుకుంటుందని అనుమానిస్తున్న క్రమంలో అనూహ్యంగా కొండా మురళి రివర్స్ కౌంటర్ కు దిగారు. తన పై విమర్శలు గుప్పిస్తున్న వరంగల్ కీలక నేతల పైనే కమిటీకి 15 పేజీలతో కూడిన నివేదిక అందించినట్లు తెలుస్తోంది. ఇదే ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి , హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి పై కొండా మురళి క్రమశిక్షణా కమిటీకి ఫిర్యాదు చేశారు. మొత్తం 15 పేజీలతో కొండా మురళి నివేదిక అందజేశారు.

**కొండా నివేదిక ప్రకారం...**

స్టేషన్ ఘన్ పూర్ లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం శ్రీహరి పార్టీని బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రేవూరి ప్రకాశ్ రెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి సహకరిస్తున్నారని, అక్రమ క్రషర్ ను ప్రోత్సహిస్తున్నాడని నివేదికలో పేర్కొన్నారు. ఇక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా తన నియోజకవర్గంలో పోస్టులు ఇప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఈ ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని ఆయన క్రమశిక్షణ కమిటీ సభ్యులను కోరారు. కమిటీ ఈ నివేదికను స్వీకరించి విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

**క్రమశిక్షణ కమిటీ తో ఏమన్నారు?**

పార్టీ క్రమశిక్షణా కమిటీ ముందు కొండా మురళి మాట్లాడుతూ నన్నెవరూ పిలవలేదు పార్టీపై గౌరవంతోనే నేనే వచ్చానని నా వ్యక్తిత్వాన్ని సేవలను నిరాకరించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. భూపాలపల్లి నుంచి నేనే పోటీ చేయాలని అనుకున్నాను. వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ పోటీ చేసింది కాబట్టి నేను తప్పకున్నా. మరో పార్టీ నుంచి గండ్ర వొచ్చినా ఆయన మద్దతు ఇచ్చి ప్రచారం చేశాను. ఇప్పుడు ఆయనే ఇతరులతో కలిసి నాకు వ్యతిరేకంగా పని చేస్తున్నారు. మరోవైపు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి సీటు రాకపోవడానికి నేనే కారణమని నా పై కోపంగా ఉన్నట్టున్నారు. నేను కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేటప్పుడు రాజీనామా చేసే వచ్చాను. అలాగే తన తో పాటు 26 మంది కార్పొరేటర్లను తీసుకోవచ్చానని పేర్కొన్నారు. కొందరి మాదిరిగా పార్టీ మారి పదవిని ఎంజాయ్ చేయడం లేదన్నారు. ఇండియాలో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీని నేనొక్కడినే అని కమిటీకి ఇచ్చిన నివేదికలో కొండా మురళి పేర్కొన్నారు.

### మిమ్స్ డిగ్రీ కళాశాలలో జూన్ 30న
## మినీ జాబ్ మేళా

### మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి రవికృష్ణ

**మంచిర్యాల మహా :** మంచిర్యాల జిల్లా మిమ్స్ డిగ్రీ కళాశాలలో చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించడం కొరకు జూన్ 30 ఉదయం 10 గంటల 30 నిమిషాలకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలో 40 ఫార్మసిస్ట్, 20 ట్రైనీ ఫార్మసిస్ట్ లు, 30 ఫార్మా అసిస్టెంట్ లు, 10 రిటైల్ ట్రైనీ అసోసియేట్స్ పోస్టులకు గాను హైదరాబాద్, మంచిర్యాల ప్రాంతాలలో పని చేసేందుకు ఎస్. ఎస్.సి, ఇంటర్ డి ఫార్మసీ, బి. ఫార్మసీ, డిగ్రీ అర్హత కలిగిన 18 నుండి 35 సంవత్సరాల వయసు గల పురుష అభ్యర్థులు సకాలంలో మినీ జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 8247656356, 9121171671, 9110368501 నెంబర్లలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని ఆసక్తి అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని రవి కృష్ణ కోరారు.

# మీడియాపై దాడి చేస్తే సహించేది లేదు

### టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు చెక్కల శ్రీశైలం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ విషయంలో వార్తలు ప్రచురిస్తున్నారని అక్కసుతోనే బిఆర్ఎస్ శ్రేణులు మహా న్యూస్ కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించడాన్ని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చెక్కల శ్రీశైలం, ప్రింట్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు కొనియాల భాస్కర్, కార్యదర్శి దన్నారం రమేష్ లు తీవ్రంగా ఖండించారు. ప్రచురించే వార్త కథనాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్యంలో స్పందించి తీరు ఇది కాదని, తమపై వచ్చిన ఆరోపణలను మీడియా ముఖంగా ఖండించడం లేదంటే న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి ఉంటుంది.. కానీ మందబలం, డబ్బు బలం ను పోగేసుకొని ఫోర్త్ ఏస్టేట్ పై దాడికి పాల్పడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి మీడియా స్వేచ్ఛను పూర్తిగా భరించి వేశారని, ఇప్పుడు ఉన్న వార్తలను ప్రచురిస్తుంటే గుండాయిజం చేయడమే కాకుండా దాడులు చేయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఏ రాజకీయ పార్టీ అయినా, ఎవరైనా సరే మీడియా మీద దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం అని భావిస్తున్నామని తెలిపారు. మహా న్యూస్ పై దాడికి పాల్పడ్డ నిందితులపై కఠిన చర్యలు తీసుకొని భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఎంతైనా ఉందని పేర్కొన్నారు. మరో మారు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### పివి తెచ్చిన సంస్కరణలు దేశ
## ఆర్థిక వ్యవస్థ పటిష్ఠం చేసాయి

### పీవీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్

**షాద్ నగర్, మహా:** మాజీ ప్రధాని,కాంగ్రెస్ పార్టీ రాజనీతుజ్ఞుడు స్వర్గీయ పీవీ నరసింహ రావు 104 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పీవీ నర్సింహారావు చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రతినిధులతో కలిసి నివాళులు అర్పించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పీవీ ఆలోచనలు, ఆయన ఆర్థికపార్టీభారత రాజకీయ రంగాల్లో ప్రవేశపెట్టిన సంస్కరణలు మన దేశాన్ని అభివృద్ధి మార్గంపైకి తీసుకెళ్లాయి. ఒక తెలుగువాడిగా దక్షిణ భారతదేశం నుంచి వచ్చిన తొలి ప్రధామంత్రి గానే తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు. ఇవి భారత ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ వేదికలో నిలిచేలా గ్లోబల్ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య,అగ్గనూర్ బస్వం, చెంది తిరుపతి రెడ్డి, మురళీమోహన్ జమ్రూద్ ఖాన్,,అందే మోహన్ ముదిరాజ్, కొప్పునూరి ప్రవణ్, బచ్చలి నరేష్ రాజు దిలీప్ పాల్గొన్నారు..

# డీసీసీబీ ఉద్యోగుల పీఆర్సీ అందిస్తాం!

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** డీసీసీబీ ఉద్యోగుల పిఆర్సి పై తెలంగాణ వ్యవసాయ మంత్రివర్యులతో టీజీకాబ్ పాలకవర్గం భేటీ అయ్యారు. డీసీసీబీ బ్యాంక్ ఉద్యోగుల పే రివిజన్ కమిషన్ (పి.ర్.సి) అంశంపై, శనివారం టీజీకాబ్ పాలకవర్గం సభ్యులు టీజీకాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుని బంజారాహిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో మర్యాధపూర్వకంగా కలిసి చర్చించారు. గత కొంత కాలంగా పెండింగ్ లో ఉన్న డీసీసీబీ ఉద్యోగుల పిఆర్సి అంశంపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో త్వరలోనే ఆమోదం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా నిధులను 9 రోజుల వ్యవధిలో 9000 కోట్లు విడుదల చేసినందుకు గాను వారికీ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, టీజీకాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ పాలకవర్గం సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో టీజీకాబ్ డైరెక్టర్లు భోజ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# కనుల పండువగా జగన్నాథుడి రాథోత్సవం



**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగన్నాథుని రథయాత్ర అత్యంత వైభవోపేతంగా, కన్నుల పండువగా సాగింది. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో పురవీధులు జనసంద్రంగా మారాయి. హరే రామ, హరే కృష్ణ నామస్మరణతో మారుమోగాయి. శోభాయాత్రలో భాగంగా ఇస్కాన్ సభ్యులు సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన భజన కీర్తనలు, పాడిన భక్తిపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అటు మహిళలు, భక్తుల లయబద్ధ నృత్యాలు అలరించాయి. అంతకుముందు మథుర జిన్నింగ్ ఆవరణలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పూలతో అందంగా అలంకరించిన వాహనంలో ఉంచి శోభాయాత్రను ప్రారంభించారు. దేవతల వేషాధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శోభాయాత్రలో ఇస్కాన్ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై రథాన్ని తాడుతో లాగారు. పూరిలో అత్యద్భుతంగా జరిగే ఉత్సవాన్ని మరిపించేలా జిల్లాకేంద్రంలో రథయాత్ర మహోత్సవం కొనసాగింది. శోభాయాత్రలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. రహదారులను శుభ్రం చేసి రథాన్ని తాడుతో లాగారు. జై జగన్నాథ నామ స్మరణ చేస్తూ ఉత్సవాల్లో పాలు పంచుకున్నారు. పలువురు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, వ్యాపారులు భక్తులకు ప్రసాదాల వితరణ చేపట్టారు. శోభాయాత్రతో ప్రధాన వీధులన్నీ శోభాయమానంగా మారాయి. జగన్నాథుని దీవెనలతో ప్రజలు సుఖసంతోషాల ఉండాలని, సౌభాగ్యాలతో విలసిల్లాలని, అంతా శుభం కలగాలని ఇస్కాన్ ప్రతినిధులు ఆకాంక్షించారు. లోక కళ్యాణార్థమే ప్రతియేటా తమ సంస్థ ఆధ్వర్యంలో దేశవిదేశాల్లో వేడుకలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

# దేశ దశ దిశను మార్చిన తెలుగు తేజం

- పీవీ సేవలు చిరస్మరణీయం
- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత
- జిల్లా ఎంపీటీసీల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి
- పీవీ ఆర్థిక సంస్కరణల వల్లనే దేశం అభివృద్ధి
- కడ్తాల్ లో ఘనంగా పీవీ నరసింహారావు జయంతి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** దేశ ప్రధానిగా దివంగత పీవీ నరసింహారావు అనేక ఆర్థిక సంస్కరణలు, సాహసోపేత నిర్ణయాలతో, ప్రపంచంలోనే భారత్ బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు, ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాటగీత, జిల్లా ఎంపీటీసీల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం కడ్తాల్ మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించి, అయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భారతదేశ దశ దిశను మార్చిన తెలుగు తేజం, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని, పీవీ ఎంతో ధైర్యంతో 1991లో అమలు చేసిన ఆర్థిక సంస్కరణ వల్లనే దేశం నేడు ఈ స్థితిలో ఉందంటూ వారు కొనియాడారు. విదేశీమారక ద్రవ్యం నిధులు అడుగంటి పోవడంతో 1991 నాటికి, భారత్ ఆర్థికంగా గడ్డు పరిస్థితులను, ఎదుర్కొంటోందన్న, ఆ సమయంలో ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన పీవీ నరసింహారావు సాహసోపేతంగా సంస్కరణలు అమలు చేశారన్నారు. ఆనాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ తో కలిసి అనేక సంస్కరణలు అమలు చేయడం వల్ల భారత్ నేడు ఆర్థికంగా ఒడిదుడుకులు లేని స్థితిక చేరుకోగలిగిందన్నారు. ఆయన సేవలు చిర స్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు యాదగిరి రెడ్డి, సత్యంయాదవ్, బిక్కునాయక్,శంకర్, యాదయ్యగౌడ్, రమేశ్ గౌడ్, షాబుద్దీన్, ప్రవీణ్, శ్రీశైలం, బానుకిరణ్,చందు, అశోక్, మోత్యా, ఫణీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలి

**రోడ్డు భద్రత-ట్రాఫిక్ నియమాల పై అవగాహన సదస్సు**

**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు శనివారం హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతట్రాఫిక్ నీయమాల గురించి శుభం గార్డెన్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డిప్యూటి కమీషనర్ ఆఫ్ పోలీస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆటోడ్రైవర్ యూనిఫామ్ ధరించాలని, ఆటో నడపటానికి అవసరమైన పత్రాలు కలిగి ఉండాలని, మద్యం తాగి ఆటో నడపవద్దని, ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని , ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, పరిమితి కి మించి అధిక వేగంతో ఆటో నడపవద్దని, అధిక ప్రయాణికులతో ప్రయాణం చేయద్దని , నిర్దేశించిన ప్రదేశం లోనే ఆటోలు పార్కింగ్ చేయాలని సూచించారు. అలాగే ఏదైనా నేర సమాచారం ఉంటే ఆ సమాచారాన్ని పోలీస్ వారికి తెలియపరచాలని, ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ పోలీసులకు సహకరించి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని వారికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ ఏసిపి టి . సత్యనారాయణ, జి సీతారెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హనుమకొండ , ఎస్ ఐ లు కొమురెల్లి , నారాయణ, సిబ్బంది తో పాటు సుమారు 600 వందల మంది ఆటోడ్రైవర్లు ఈ సదస్సులో పాల్గొన్నారు.

## పాత అప్పుల గొడవతో ఆటో డ్రైవర్ దారుణ హత్య

**ముగ్గురు నిందితులు అరెస్ట్**

**వివరాలు వెల్లడించిన హన్మకొండ ఏసిపి**



**హన్మకొండ మహా;** హనుమకొండ నగరంలో ఆటో డ్రైవర్ హత్య తీవ్ర కలకలం రేపింది. ఆర్థిక లావాదేవీలు ప్రాణాలు తీశాయి. దశాబ్దకాలంగా కొనసాగుతున్న పాత అప్పుల వివాదం చివరకు హత్యకు దారితీసింది. ఆటోడ్రైవర్‌ను పక్కా ప్రణాళికతో దారుణంగా హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులను హనుమకొండ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి అరెస్టు చేశారు. మృతుడు, నిందితులలో ఇద్దరు బంధువులే కావడం ఈ కేసులో మరో మలుపు..

**ఏసిపి అందించిన వివరాల ప్రకారం...**

వడ్డెపల్లి నివాసి, ఆటోడ్రైవర్ అయిన మొహమ్మద్ సాదిక్ హుస్సేన్ (48) తన పెద్దనాన్న కుమారుడు బాదర్ హుస్సేన్ @ బాబుకు 2016లో కుటుంబ అవసరాల నిమిత్తం రూ. 3 లక్షలు అప్పుగా ఇచ్చారు. ఇందులో కొంత డబ్బు తిరిగి చెల్లించినా, మిగతా మొత్తం విషయంలో తీవ్ర వివాదం నడుస్తోంది. ఈ అప్పు గురించి బాదర్ కుమారులు, నిందితులు మొహమ్మద్ సోహైల్ హుస్సేన్ @ మోను (23), మొహమ్మద్ బషీర్ హుస్సేన్ సోను (25) లు సాదిక్‌ను తరచుగా బెదిరింపులకు గురి చేశారు. డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తాం అంటూ పదేపదే హెచ్చరించడం, రాత్రి సమయాల్లో ఫోన్ చేసి దూషించడం, మానసికంగా వేధించడంతో సాదిక్ తీవ్ర ఒత్తిడికి లోనైనట్లు దర్యాప్తులో తేలింది. ఈ వేధింపులకు ఆగ్రహించిన సోహైల్, బషీర్‌లు.. సాదిక్ ను ఎలాగైనా అంతమొందించాలని పక్కా పథకం వేశారు. జూన్ 25, 2025 రాత్రి అందాజ 11:00 గంటల సమయంలో, సోహైల్, బషీర్‌లు సాదిక్ ఇంటికి వెళ్లి తలుపు తట్టారు. సాదిక్ బయటకు రాగానే, అతన్ని సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి బలవంతంగా లాక్కెళ్లారు. అక్కడ వారికి బంధువు అయిన మొహమ్మద్ అక్రమ్ హుస్సేన్ (40) తోడయ్యారు. ముగ్గురూ కలిసి సాదిక్‌ను అత్యంత దారుణంగా కొట్టి చంపారు. ప్రత్యేకించి సోహైల్ బలమైన దాడితోనే సాదిక్ మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన తెల్లవారుజామున 01:00 గంటల ప్రాంతంలో జరిగిందని పోలీసులు నిర్ధారించారు. హత్యకు గురైన సాదిక్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న హనుమకొండ పోలీసులు, తక్షణమే దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు. పక్కా ఆధారాలతో మొహమ్మద్ సోహైల్ హుస్సేన్ @ మోను, మొహమ్మద్ బషీర్ హుస్సేన్ @ సోను, మొహమ్మద్ అక్రమ్ హుస్సేన్‌లను అరెస్టు చేసి, వారిపై Cr.No. 374/2025 U/s 103(1) R/w 3(B) BNS సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు హనుమకొండ ఏసీపీ పి నరసింహారావు పర్యవేక్షణలో కొనసాగుతోంది.



## వరంగల్ ఏఎస్పీగా శుభం ప్రకాష్ నియామకం

**వరంగల్ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ డివిజన్ ఏ ఎస్పీగా ఎన్. శుభం ప్రకాష్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 ఐ. పి. ఎస్ బ్యాచ్ కు చెందిన శుభం 2024 సంవత్సరంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ఆరు నెలల పాటు ట్రైనీ ఐ. పి. ఎస్ గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం వరంగల్ ఏసీపీగా పనిచేస్తున్న నందిరాం నాయక్ డిజిపి కార్యాలయానికి బదిలీ అయ్యారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన 19 మందికి జైలు శిక్ష

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**హన్మకొండ మహా;** మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా గత వారంలో 19 మంది వాహనదారులు జైలు శిక్ష అనుభవించారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా పత్యక్షంగాని, పరోక్షంగాని రోడ్డు ప్రమాదాలకు ప్రధానకారకులు కావడంతో కొన్ని సందర్భాల్లో సదరు మద్యం సేవించిన వాహనదారుడు సైతం రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. తద్వారా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇది దృష్టిలో ఉంచుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్ మద్యం సేవించి వాహనదారుల వలన కలిగే రోడ్డు ప్రమాదాల నివారణ కై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇందులో భాగంగానే వరంగల్ ట్రైసిటి పరిధిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారని అలాగే గ్రామీణా ప్రాంతాల్లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడుతున్నాయి. ప్రధానంగా వరంగల్ ట్రై పరిధిలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులకు ముందుగా కమిషనరేట్ కార్యాలయంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ వారు వాహనదారుల కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చడం ద్వారా వాహనదారులకు కోర్టులో జైలు శిక్ష లేదా జరిమాన విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో గత వారం రోజుల్లో ట్రైసిటి ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 368 కేసులు నమోదు కాగా, ఇందులో 19 మందికి వాహనదారులకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వగా, 5లక్షల 82వేల రూపాయలు వాహనదారులపై ఫైన్ రూపంలో కోర్టులో జరిమానాలు చెల్లించారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. నమోదైన కేసుల్లో అత్యధికంగా వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 168 కేసులు నమోదు కాగా ఇందులో 06 మందికి జైలు శిక్ష పడగా, 2లక్ష 22వేల ఐదు వందల రూపాయల్లో వాహనదారులు కోర్టులో జరిమానా చెల్లించారు. ఇదే రీతిలో హన్మకొండ పరిధిలో 104 కేసులో 08మంది కి జైలు శిక్ష, 1లక్ష 09వేల రూపాయల జరిమాన, కాజీపేట పరిధిలో మొత్తం 95 కేసులు నమోదు కాగా ఇందులో ఐదు గురికి జైలు శిక్ష పడగా, మిగితా కేసుల్లో మొత్తం 2లక్ష 50వేల ఐదు వందల రూపాయలు జరిమానా చెల్లించారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వాహన దారులకు సూచన చేస్తూ మీ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపవద్దని, మీరు చేసే తప్పిదాలతో ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయినవారు కొందరైతే మరి కొందరు అంగవైకల్యంతో జీవితాలను కొనసాగిస్తూన్నారని గుర్తు చేశారు. ఇకనైన వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని వాహనదారులు మీ గమ్యానికి సురక్షితంగా చేరుకోవడమే వరంగల్ కమిషనరేట్ పోలీసుల ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.



## డిప్యూటీ డీఎం, హెచ్ఓలకు సమ్మె నోటీస్‌ను అందజేసిన గన్నారపు రమేష్

**వరంగల్ మహా ;** ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ ఆధ్వర్యంలో డిఎంఅండ్ హెచ్ఓ కార్యాలయలో శనివారం నర్సంపేట డిప్యూటీ డి.ఎం.అండ్.హెచ్.ఓ/ డిస్టిక్ ఇమినైజేషన్ ఆఫీసర్ డాక్టర్.ఐ ప్రకాష్ , వర్ధన్నపేట డిప్యూటీ డి.ఎం.అండ్.హెచ్.ఓ డాక్టర్ కొమురయ్య ఇరువురి కి సమ్మె నోటీసును ఇవ్వడం జరిగింది. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులంతా మహాధర్నా కార్యక్రమానికి వెళ్తున్నామని ఈ సందర్భంగా ఉద్యోగులకు సెలవు ప్రకటించాలని కోరారు. అలాగే వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ 78 క్యాడర్స్ ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని జన్ను కొర్నోల్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, జాతీయ ఆరోగ్య మిషన్ కాంటాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఇద్దరు కలిసి మాట్లాడుతూ... ప్రభుత్వం 7 నెల ఏరియర్స్ బకాయిలు వెంటనే ఇవ్వాలని, ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల్లో ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ మరియు హెల్త్ ఇన్సూరెన్స్ ,పి.ఎఫ్.,ఈ ఎస్ ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి అనుబంధం జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్ ,వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను కొర్నోల్, ఏఐటియుసి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు యాకూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు మౌళిక వసతుల కల్పన

**రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ అయేషా మస్రత్ ఖానం**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మౌళిక వసతుల కల్పన కు కృషి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ అయేషా మస్రత్ ఖానం అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సులేమాన్, టి.జి.ఎం.ఐ.డి.సి. ఈ.ఈ. నరసింహారావు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని ఆమె కోరారు. త్వరలో విద్యాబోధన కొరకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడంతో పాటు ఒప్పంద పద్ధతిన ఇతర పోస్టులలో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్న పోస్టులను అవసరం ఉన్న మేరకు భర్తీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులకు సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని ఎప్పటికప్పటికి చూడాలని వెల్లడించారు. జిల్లాలో తలపెట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల, మాతాశిశు కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్మాణం కొనసాగుతున్న మాతాశిశు ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి వార్డులు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చిన్న కాలేశ్వరం పనులను స్పీడప్ చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**భూపాలపల్లి, మహా :** కాటారం సబ్ డివిజన్లో సుమారు 40000 ఎకరాలకు సాయినాథ్ సాగునీరు అందించే చిన్న కాలేశ్వరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శనివారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో చిన్న కాళేశ్వరం పనులు ప్రగతిపై ఇరిగేషన్ , ఫారెస్ట్, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు మెగా కంపెనీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులలో వేగం పెంచాలని తెలిపారు. ఆధునీకరణలో ఉన్న చెరువుల, కాలువల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంపు హౌస్ పనులను సైతం వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. భూ సేకరణ సమస్యలు ఉన్న గ్రామాల్లో లో గ్రామ సభలు నిర్వహించి గ్రామస్థులతో తీర్మానం చేయించాలని, భూసేకరణ పూర్తి అయిన గ్రామాలలో పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సోమవారం నుండి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులలో పురోగతిని పరిశీలించి నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, ఇరిగేషన్ ఈ.ఈ సూర్య ప్రకాష్, మెగా కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సమర్ధవంతంగా పనిచేయాలి

**జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**



**భూపాలపల్లి, మహా :** పోలీసు అధికారులు, సిబ్బంది నేరాల నియంత్రణకు సమర్ధవంతంగా పనిచేయాలనీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్లలో నేరాల నమోదు, పెండింగ్ కేసులు, ఎన్బిఎం వారెంట్లు, ఎస్సీ, ఎస్టీ కేసులు, మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాలు, పోక్సో కేసులు, కోర్టు మానిటరింగ్, శిక్షల అమలుపై చర్చించి, పోలీసు అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధులను విజిబుల్ పోలిసింగ్ తో పాటు ప్రభావవంతంగా నిర్వర్తించాని అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున పోలీసు అధికారులు, సిబ్బంది పకడ్బందిగా పని చేయాలని, గ్రామాలలో జరిగే శాంతి భద్రతల అంశాలను ముందస్తు సంచారం సేకరించి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల పనితీరు ను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన ఫంక్షన్ వర్టికల్ లలో ఎవ్వరికి కేటాయించినా విధులను వారు అప్డేట్ చేస్తూ మెరుగుపరచుకోవాలని సూచించారు. సైబర్ మోసాలపై, మహిళా భద్రతపై అవగాహన కల్పించాలనీ, సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. పోలీసు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సత్వరంగా సేవలు అందించాలని పేర్కొన్నారు. అలాగే అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, నిత్యం వాహన తనిఖీలు చేయాలని ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. అలాగే జిల్లాలో రౌడి షిటర్స్ పై నిఘా ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఏనరేష్ కుమార్, భూపాలపల్లి, కాటారం, డిఎస్పీలు సంపత్ రావు, సూర్య నారాయణ, నారాయణ నాయక్, జిల్లా పరిధి లోని సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## ఘనంగా పివి నరసింహారావు జయంతి వేడుకలు



**ఎల్బీనగర్,మహా :** బహుభాషా కోవిదుడు బారతరత్న పీవీ నరసింహారావు 105వ జయంతినీ పురస్కరించుకొని ఎల్బీనగర్ లోని అల్కాపురిలో గల పివి నరసింహ రావు విగ్రహానికి పీవీ నరసింహారావు జిల్లా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణ రావు పివి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ఏదో ఒక జిల్లాకు పీవీ నరసింహారావు పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. దేశ ప్రధానిగా పీవీ నరసింహారావు చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, ఆర్.కె.పురం హనుమాన్ టెంపుల్ ధర్మకర్త ప్రముఖ న్యాయవాదికానాల శ్యాంసుందర్రావు, మురుకుంట్ల రాజేశ్వర శర్మ, దేవులపల్లి అశోక్ కుమార్, గుడా రాజేశ్వరరావు, ఊరే ప్రసాదరావు, గూడ జయరాం, తడకమల రంగసాయి, గాదే జయ చందర్, వీరరాజు, దేవులపల్లి నరసింహారావు మురళీధర్ రావు, మాల్యాల వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలి

**తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్**



**వరంగల్ మహా;** బిజేపి ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతింటున్నదని గీసుకొండ మండలం అనంతారం గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతన్న మేలుకో.. వ్యవసాయం గురించి షార్ట్ ఫిలిం ప్రోగ్రాం ప్రొజెక్టర్ ద్వారా గ్రామస్థులకు చుపెట్టడం జరిగింది. ఈ సభకు బోయపాటి నరసింహారావు అధ్యక్షతన రైతుల సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేకమంది రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకుంటున్నారు .ప్రధాన కారణం పంటలకు మోడి గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం. వ్యాపారస్తులకు లాభాలు చేయడానికి రైతుల పొట్ట కొట్టడం. పంటలకు సరైన గిట్టుబాటు ధర నిర్ణయించే అధికారం కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఉన్నందున గతంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ఉన్నప్పటికీ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించడం లేదని పెరిగిన విత్తనాలు , ఎరువులు ,పురుగు మందులు , ట్రాక్టర్, కూలీల ఖర్చులను పరిగణంలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. దీనివల్ల రైతులకు కొన్ని సందర్భాల్లో పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదు. మార్కెట్లోకి రైతుల పంటలు రాగానే ఒక్కసారిగా ధరలు పడిపోతున్నాయి. ప్రభుత్వమే పంటలు కొనుగోలు చేయాలని అలాగే పత్తిని సి సి ఐ కొనుగోలు చెప్పినప్పటికీ సరైన సమయంలో కొనుగోలు చేయడం లేదని కొంత మంది దళారులు కొనుగోలు చేసిన ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నారని ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి ఎంతో దారుణంగా ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచి రైతులను ఆదుకోవాలని కనీస మద్దతు ధరలు నిర్ణయించి , కేంద్రం ద్వారా పంటలను కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని గ్రామ కమిటీని 7 ఏడుగురు తో ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా బోయపాటి నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా గద్దె రామారావు, తో పాటు సయింపు వెంకటేశ్వర రావు, దండ ఆదినారాయణ, గద్దె నాగేశ్వరరావు, శ్రీనివాస్, రవీందర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యాశాఖ బలోపేతం

- విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు
- పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి, మహా :** విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం టేకుమట్ల మండలంలోని కస్తూరి భా గాంధీ గురుకుల పాఠశాలలో 2.30 కోట్ల తో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు, ప్రయోగ శాల భవనాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ , రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి తో కలిసి ప్రారంబించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భూపాలపల్లి కలెక్టర్ గా విధులలో చేరిన సంవత్సర కాలంలో విద్యా, వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, జిల్లాలో ప్రతి రోజు ఎక్కడో ఒక చోట మండల ప్రత్యేక అధికారులు, జిల్లా కలెక్టర్ సైతం గురుకుల పాఠశాలల్లో తనికీలు చేపడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు అడిగిన మేరకు పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణానికి, చేతిపంపు, డయాస్ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి గురుకుల పాఠశాలలో కావలసిన అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ...**

విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని విద్యాశాఖను తన దగ్గరే పెట్టుకొని విద్యాశాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ అధికారంలోకి వచ్చిన సంవత్సరన్నర కాలంలోనే ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో గవర్నమెంట్ పాఠశాలలో సీట్లు కోసం రికమెండ్ చేసే రోజులు రాబోతున్నాయని అన్నారు. గురుకులాల నుండి పాఠశాలలకు బస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులను తరలించే రోజులు త్వరలో రాబోతున్నాయని. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన విద్యా బోధన అందించేందుకు మన నియోజకవర్గంలో ఘనపురం మండలం గాంధీ నగర్ గుట్ట వద్ద 30 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ స్కూల్ క్యాంప్లెక్స్ ను నిర్మించబోతున్నామని తెలిపారు. తన ఎస్ డి ఎఫ్ నిధుల నుండి ఇప్పటి వరకు పాఠశాలలకు 7 కోట్లు వరకు కేటాయించడం జరిగిందని ప్రభుత్వ గురుకుల పాఠశాలలులో విద్యార్థుల కు వేడి నీళ్ల కొరకు గీజర్లు , దుప్పట్లు అందించామని త్వరలో గురుకులాల్లో కావలసిన బెడ్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకొని తమ లక్ష్యాలను చేరుకోవాలని ప్రభుత్వ పాఠశాలలలో చదివిన విద్యార్థులు ఎందులో తక్కువ కాదని నిరూపించాలని ఎమ్మెల్యే సత్యనారాయణ రావు ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి మాట్లాడారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిసిడిఓ శైలిజ, తహసీల్దార్ విజయ లక్ష్మీ, ఎంపీడీవో అనిత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పాలు అమ్మాడు.. రూ.పదివేల కోట్లు సంపాదించాడు



పేదరికంలో పుట్టిన ఓ బాలుడు ముక్కపచ్చలారని వయసులో ఉదయాన్నే లేచి పాలు పోసి గడియారం తొమ్మిది కొట్టిందటే ఠంచనుగా బ్యాగ్ భుజాన వేసుకొని స్కూల్ వెళ్లి చదుకునేవాడు. తాను ఉంటున్న ప్రాంతంలో ఎక్కడికి ప్రయాణం చేయాలన్నా దాదాపు రోజూ 78 కిలోమీటర్ల దూరం నడిచేవాడు. పండగల తోటి స్నేహితులు సరదాగా గుడుపుతుంటే తాను మాత్రం బాణసంచా విక్రయిస్తూ కుటుంబ పోషణలో భాగమయ్యేవాడు. విధి తన కష్టాలను గుర్తించింది. ఓ అవకాశం కల్పించింది. దాంతో ప్రస్తుతం తాను దాదాపు రూ.10,790 కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించాడు. రిజ్వాన్ సాజన్ ముంబయిలోని ఘట్కోపర్‌లో పేద కుటుంబంలో జన్మించారు. ఓ స్టీల్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తన తండ్రి నెలకు రూ.7,000 సంపాదించేవాడు. రిజ్వాన్ తండ్రికి నలుగురు సంతానం. కుటుంబ పోషణకు ఆయన సంపాదన ఏమాత్రమూ సరిపోయేది కాదు. ఎలాగోలా నెట్టుకొచ్చేవారు. ఉన్నట్టుండి కుటుంబ పెద్ద, రిజ్వాన్ తండ్రి అకాల మరణం చెందారు. ఆ సమయంలో రిజ్వాన్‌కు ఏమి పాలుపోలేదు. కుంటుంబ భారం అంతా తనపై పడింది. ఏదోఒక పనిచేయాలని నిర్ణయించుకున్నాడు. తాను ఉంటున్న ప్రాంతంలో పాలు పోయడం ప్రారంభించాడు. నిత్యం 7 నుంచి 8 కిలోమీటర్లు కాలినడకనే ప్రయాణించేవాడు. స్కూల్ ఫీజు కట్టలేక మధ్యలోనే బడి మానేశాడు. పండగ రోజుల్లో వీధుల్లో బాణసంచా విక్రయించేవాడు.

**మేనమామ సాయం**

1981లో తన మేనమామ సాయంతో రిజ్వాన్ పని కోసం కువైట్ వెళ్లారు. అక్కడ ఒక సాధారణ భవన నిర్మాణ సామగ్రి దుకాణంలో ట్రయినీ సేల్స్ మ్యాన్‌గా చేరారు. నెలకు అప్పటి లెక్కల ప్రకారం.. రూ.18,000 వచ్చేవి. క్రమంగా ఉద్యోగంలో ఎదుగుతూ ఒక దశాబ్దంలో సేల్స్ మేనేజర్ స్థాయికి చేరుకున్నారు. కానీ విధి ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా. 1990లో గల్ఫ్ యుద్ధం కారణంగా కువైట్ నుంచి రావాల్సిన పరిస్థితి ఎదురైంది.

**దుబాయ్‌లో..**


కువైట్ నుంచి దుబాయ్ వచ్చిన రిజ్వాన్ ఒక బ్రోకరేజ్ సంస్థలో చేరారు. నిర్మాణ సామగ్రిలో నిరుపయోగం అవుతున్న కొన్ని వస్తువులకు సంబంధించిన అంశాలను గుర్తించారు. 1993లో కొంత పెట్టుబడితో సొంతంగా డాన్యూబ్ పేరుగో రియల్‌ఎస్టేట్ వెంచర్‌ను స్థాపించారు. క్రమంగా ఎదిగి దాన్ని 1.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10,790 కోట్లు) వ్యాపార సామ్రాజ్యంగా తీర్చిదిద్దారు. ఈ కంపెనీ కింది రంగాల్లో సేవలందిస్తోంది.

**బిల్డింగ్ మెటీరియల్స్**
**రియల్ ఎస్టేట్, లగ్జరీ టవర్స్**
**హోమ్ అలంకరణ**
**మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు**

## దాతృత్వ కార్యక్రమాలు

**రిజ్వాన్ సాజన్ దాతృత్వ కార్యక్రమాల్లోనూ ముందుంటున్నారు. డాన్యూబ్ వెల్ఫేర్ సెంటర్ ద్వారా ఉచిత న్యాయ సహాయం, మెంటల్ కౌన్సెలింగ్, ఆర్థిక అక్షరాస్యత వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. భారత్, యూఏఈల్లోని నిరుపేద పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారు. పాఠశాలల మౌలికసదుపాయాలకు నిధులు సమకూరుస్తున్నారు. అల్పాదాయ కుటుంబాలకు ముఖ్యంగా క్రిటికల్ ఇల్‌నెస్ ఉన్న పిల్లలకు వైద్య చికిత్సలకు సాయం చేస్తున్నారు.**

# హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్‌లో జోరు



హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో బలమైన పనితీరు చూపించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు ఆఫీస్ స్పేస్ లీజింగ్ 23 శాతం అధికంగా 32 లక్షల చదరపు అడుగులుగా (ఎస్ఎఫ్‌టీ) నమోదైంది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో లీజింగ్ పరిమాణం 26 లక్షల ఎస్ఎఫ్‌టీగా ఉంది. దేశవ్యాప్తంగా ఏడు నగరాల్లోనూ స్థూల ఆఫీస్ స్పేస్ లీజింగ్ 11 శాతం పెరిగి 178 లక్షల ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్టు కొలియర్స్ ఇండియా ఒక నివేదిక రూపంలో వెల్లడించింది. అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ కార్పొరేట్ల నుంచి లీజింగ్‌కు మంచి డిమాండ్ కనిపించినట్టు తెలిపింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఏడు నగరాల్లో స్థూల ఆఫీసు లీజింగ్ 161 లక్షల ఎస్ఎఫ్‌టీగా ఉంది. హైదరాబాద్ సహా బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, పుణెలో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ పెరగ్గా.. ఒక్క ముంబైలో మా త్రం తగ్గింది. ఈ గణాంకాల్లో లీజు పునరుద్ధరణ లు, ముందస్తు హామీలు, ఆసక్తి వ్యక్తీకరణలకు సంబంధించి డేటా లేదని కొలియర్స్ స్పష్టం చేసింది.

**నగరాల వారీ లీజింగ్..**

బెంగళూరులో 48 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజింగ్ లావాదేవీలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలోనూ ఆఫీస్ స్పేస్ లీజింగ్ 48 లక్షల ఎస్ఎఫ్‌టీగానే ఉండడం గమనించొచ్చు. చెన్నైలో క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 30 శాతం అధికంగా 26 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజింగ్ నమోదైంది. ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో ఆఫీస్ వసతుల లీజింగ్ 16 శాతం వృద్ధితో 22 లక్షల ఎస్ఎఫ్‌టీగా ఉంది. కోల్‌కతాలో లీజింగ్ 3 లక్షల నుంచి 6 లక్షల చదరపు అడుగులకు దూసుకెళ్లింది. పుణె నగరంలో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 60 శాతం పెరిగి రూ.16 లక్షల చదరపు అడుగులకు చేరింది. ముంబైలో మాత్రం ఆఫీస్ స్పేస్ లీజింగ్ 28 లక్షల ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 35 లక్షల చదరపు అడుగులతో పోల్చి చూసినప్పుడు 20 శాతం తగ్గింది. ఈ ఏడు పట్టణాల్లో కలిపి 175 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజింగ్‌కు గాను 135 లక్షల ఎస్ఎఫ్‌టీని కార్పొరేట్లు తీసుకున్నారు. 43 లక్షల ఎస్ఎఫ్‌టీని కోవర్కింగ్ ఆపరేటర్లు తీసుకోవడం గమనార్హం.

**ఈ ఏడాది ప్రోత్సాహకరమే**

"భారత ఆఫీస్ మార్కెట్ 2025లోనూ వృద్ధి దశలో ఉంది. గత రెండు సంవత్సరాలుగా నమోదవుతున్న సానుకూల ధోరణికి అనుగుణంగానే ఉంది. స్థిరమైన సరఫరా, లీజుదారుల పరంగా వైవిధ్యం మద్దతుతో 2025 సంవత్సరం వాణిజ్య రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ప్రోత్సాహకరంగా ఉండనుంది. మొత్తంమీద ఆఫీస్ స్పేస్ డిమాండ్ ఈ ఏడాది చివరికి 65-70 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరుకోవచ్చు" అని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ ఎండీ అర్పిత్ మల్హోత్రా తెలిపారు.

# ఫిజిక్స్‌వాలా డిజిటల్ యూనివర్సిటీ




గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని వారికి కూడా నాణ్యమైన ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో సీఎస్‌సీ అకాడమీతో (సీఎస్‌సీఏ)తో ఎడ్యుకేషన్ కంపెనీ ఫిజిక్స్‌వాలా చేతులు కలిపింది. ఈ ఒప్పందం కింద డిజిటల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇది అక్రెడిటెడ్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రోగ్రాంలు, సర్టిఫికేషన్లు అందిస్తుంది. బోధన కోసం కేంద్ర ఐటీ శాఖలో భాగమైన కామన్ సర్వీసెస్ సెంటర్లు (సీఎస్‌సీ) డిజిటల్ లెర్నింగ్ సెంటర్లుగా పని చేస్తాయి. అలాగే, ఫిజిక్స్‌వాలా సంస్థ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానాల్లో కూడా అందిస్తుంది. సైబర్‌సెక్యూరిటీ, కృత్రిమ మేథ వంటి అంశాల్లో నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణనివ్వడం, సమిష్టిగా కోర్సులు .. సర్టిఫికెట్ ప్రోగ్రాంలను రూపొందించడం మొదలైనవి ఈ భాగస్వామ్య లక్ష్యంగా ఉంటాయి.

# వడ్డీరేట్లు సవరించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఫిక్స్డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) వడ్డీ రేట్లను మరోసారి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. జూన్ 25, 2025 నుంచి బ్యాంక్ రూ.3 కోట్ల కంటే తక్కువ డిపాజిట్లపై సింగిల్ ఎఫ్‌డీ కాలపరిమితిపై వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు (బీపీఎస్) తగ్గించింది. 2025 జూన్ 10న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును 6 శాతం నుంచి 5.5 శాతానికి తగ్గించింది. అందుకు అనుగుణంగా బ్యాంకు కూడా తన కస్టమర్లకు వడ్డీ తగ్గిస్తున్నట్లు ప్రకటించింది.

**ఏ ఎఫ్‌డీ ప్రభావితం అవుతుందంటే..**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 15 నెలల కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీలపై వడ్డీ రేటును 18 నెలలకు తగ్గించింది. గతంలో ఈ రేటు సాధారణ కస్టమర్లకు 6.60 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.10 శాతంగా ఉండేది. ఇప్పుడు సాధారణ కస్టమర్లకు 6.35 శాతం, సీనియర్లకు 6.85 శాతంగా ఉంది. బ్యాంక్ సాధారణ ప్రజలకు (18 నెలల నుంచి 21 నెలల కంటే తక్కువ కాలపరిమితి ఉంటే) 2.75% నుంచి 6.60% వరకు, సీనియర్ సిటిజన్లకు రూ .3 కోట్ల కంటే తక్కువ మొత్తాలకు 3.25% నుంచి 7.10% వరకు ఎఫ్‌డీ రేట్లను అందిస్తుంది.

**ముందస్తు ఉపసంహరణకు జరిమానా**

ఎఫ్‌డీని ముందుగా నిర్ణయించిన కాలపరిమితి కంటే ముందుగానే విత్‌డ్రా చేస్తే బ్యాంక్ జరిమానా వసూలు చేస్తుందని గుర్తుంచుకోవాలి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిబంధనల ప్రకారం మెచ్యూరిటీకి ముందే ఎఫ్‌డీని ఉపసంహరించుకుంటే మీ డబ్బు బ్యాంకులో ఉన్న కాలానికి వర్తించే రేటు కంటే 1% తక్కువగా పొందుతారు.

**సేవింగ్స్ ఖాతా రేట్లు ఇలా..**

ఎఫ్‌డీ రేటు తగ్గింపుతో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అన్ని పొదుపు ఖాతాలపై వడ్డీ రేటును తగ్గించింది. జూన్ 24, 2025 నుంచి పొదుపు రేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గింది. అంటే అన్ని సంవత్సరానికి 2.75% నుంచి 2.50%కి వడ్డీరేట్లను చేర్చింది. పొదుపు ఖాతా వడ్డీని రోజువారీగా లెక్కించి ప్రతి మూడు నెలలకు ఒకసారి చెల్లిస్తారు.

**రికరింగ్ డిపాజిట్లపై ఇలా..**

బ్యాంక్ రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) వడ్డీ రేట్లు డిపాజిట్ వ్యవధిని బట్టి సాధారణ కస్టమర్లకు 4.25% నుంచి 6.60%, సీనియర్ సిటిజన్లకు 4.75% నుంచి 7.10% మధ్య ఉంటాయి. ఈ రేట్లు 2025 జూన్ 10 నుంచి అమల్లో ఉన్నాయి.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# కెనడాతో వాణిజ్య చర్చలు ముగిస్తున్నాం..

## ట్రంప్ సంచలన ప్రకటన

కెనడా విధిస్తున్న డిజిటల్ సర్వీస్ ట్యాక్స్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా కీలక ప్రకటన చేశారు. ఈ డిజిటల్ సర్వీస్ ట్యాక్స్‌పై కెనడా వెనక్కి తగ్గకపోవడంతో ఆ దేశంతో అన్ని రకాల వాణిజ్య చర్చలు ముగిస్తున్నట్టు తాజాగా ప్రకటించారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ట్రూత్‌లో సంచలన ప్రకటన చేశారు. 'కెనడాతో అన్ని రకాల వాణిజ్య చర్చలను తక్షణమే నిలిపివేస్తున్నాం' అని ప్రకటించారు. కెనడలో డిజిటల్ సేవల పన్ను గతేడాది అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే, కంపెనీలు మాత్రం ఈ ఏడాది జూన్ 30 నుంచి పన్ను చెల్లింపులు ప్రారంభించాలని నిర్ణయించుకున్నాయి. ఈ చట్టం ప్రకారం.. కెనడాలో ఆన్‌లైన్ ద్వారా గణనీయమైన ఆదాయం అర్జించే పెద్ద డిజిటల్ కంపెనీలు తమ ఆదాయంపై 3 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్ సేవలు, ఆన్‌లైన్ ప్రకటనలు, సోషల్ మీడియా సేవలు, వినియోగదారుల డేటా అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ఈ పన్ను పరిధిలోకి వస్తుంది. ఈ విధానం యూఎస్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన పెద్ద పెద్ద టెక్ కంపెనీలు, ఇకామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. దీంతో అధ్యక్షుడు దీనిపై ప్రధానంగా దృష్టి సాధించారు. జూన్ 30 నుంచి ఈ కొత్త పన్నుల విధానం అమల్లోకి రానున్న నేపథ్యంలో ట్రంప్ ఈ కఠిన నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## భారత్ దాడిలో దెబ్బతిన్న టెర్రరిస్ట్ లాంచ్‌ప్యాడ్స్‌ను

# తిరిగి పునర్నిర్మిస్తోన్న పాక్..!



సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ 'ఆపరేషన్ సిందూర్' ద్వారా గట్టి గుణపాఠం చెప్పిన విషయం తెలిసిందే. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు చేసింది. భారత్ చేపట్టిన ఈ దాడుల్లో ఉగ్రస్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే, భారత్ చేతిలో చావుదెబ్బ తిన్నప్పటికీ పాక్ తీరులో మాత్రం మార్పు రావడం లేదు. ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బతిన్న టెర్రరిస్ట్ లాంచ్‌ప్యాడ్స్‌ను పాక్ మళ్లీ తిరిగి పునర్నిర్మిస్తోంది. భారత్ జరిపిన ఖచ్చితమైన సైనిక దాడుల సమయంలో ధ్వంసమైన ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లు, శిక్షణా శిబిరాలను పాకిస్థాన్ పునర్నిర్మించడం ప్రారంభించిందని సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. పాకిస్థాన్ సైన్యం, ఆ దేశ గూఢచార సంస్థ ఐఎస్ఐ కలిసి ఉగ్రవాద ట్రైనింగ్ క్యాంపులను, పీఓకేలో ఉగ్రవాదుల కోసం మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నట్టు సమాచారం. నియంత్రణ రేఖ వెంబడి ఉన్న దట్టమైన అడవుల్లో భారత రాడార్, ఉపగ్రహాలు గుర్తించలేని విధంగా హైటెక్ మినీఉగ్ర శిబిరాలను పాక్ నిర్మిస్తున్నట్లు నిఘా సంస్థలు సూచిస్తున్నాయి. లుని, పుట్వాల్, తైపు పోస్ట్, జమిలా పోస్ట్, ఉమ్రాన్వాలి, చాప్రార్, ఫార్వర్డ్ కహుటా, చోటా చక్, జంగ్లోరా వంటి ప్రాంతాల్లో శిబిరాలను పునర్నిర్మిస్తున్నట్లు తెలిసింది. కొత్తగా నిర్మిస్తున్న ఈ శిబిరాల్లో థర్మల్ ఇమేజర్లు, ఫోలేజ్ పెనెట్రేటింగ్ రాడార్, ఉపగ్రహ నిఘాను ఎదుర్కోవడానికి రూపొందించిన అధునాతన సాంకేతికతలు అమర్చినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. పాక్ సైన్యం, ఐఎస్ఎస్ కూడా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 13 లాంచ్ ప్యాడ్‌లను తిరిగి అభివృద్ధి చేస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం. కెల్, షార్ది, దుధ్నియల్, అత్ముకం, జురా, లీపా వ్యాలీ, పచిబన్ చమన్, తాండ్‌పాని, నయాలి, జన్కోట్, చకోటి, నికైల్, ఫార్వర్డ్ కహుటా వంటి ప్రాంతాల్లో వీటిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిసింది. వీటితోపాటు జమ్ము సెక్టార్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న నాలుగు లాంచ్‌ప్యాడ్‌లను ఐఎస్ఐ తిరిగి అభివృద్ధి చేస్తున్నట్లు సమాచారం. వీటిలో మస్రూర్ బడా భాయ్, చాప్రార్, లూని, షకర్‌గఢ్‌లోని డ్రోన్ సెంటర్లు ఉన్నాయి. భారత్ దెబ్బకు తీవ్రంగా నష్టపోయిన పాక్ ఒకే ప్రదేశంలో ఉగ్రవాదులు ఉండకుండా.. పెద్ద శిబిరాలను చిన్నవిగా విభజించినట్లు తెలుస్తోంది. ఇలా చేయడం వల్ల ఏదైనా దాడి జరిగినా నష్టాన్ని నివారించొచ్చని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి మినీ క్యాంప్‌కు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేకంగా శిక్షణ పొందిన పాక్ ఆర్మీ సిబ్బంది వీటిని పర్యవేక్షించనున్నట్లు సమాచారం.



# పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి..

## 13 మంది సైనికులు మృతి

పొరుగు దేశం పాకిస్థాన్‌లో సైనిక కాన్వాయ్ లక్ష్యంగా ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో 13 మంది సైనికులు మరణించినట్లు ప్రముఖ వార్తా సంస్థ ఏఎఫ్‌పీ వెల్లడించింది. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఆత్మాహుతి బాంబు దాడి జరిగినట్లు పేర్కొంది. 'ఒక ఆత్మాహుతి బాంబు పేలుడు పదార్థాలు నిండిన వాహనం సైనిక కాన్వాయ్‌పైకి దసుకెళ్లింది. ఈ పేలుడులో 13 మంది పాక్ సైనికులు మరణించారు. 10 మంది సిబ్బంది, 19 మంది పౌరులు గాయపడ్డారు' అని పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని ఉత్తర వజీరిస్థాన్ జిల్లా ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. ఈ దాడికి ఇప్పటి వరకూ ఏ గ్రూపూ బాధ్యత వహించలేదు. అయితే, ఇటీవలే ఈ ప్రాంతంలో తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ సైనికులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతోంది.

# నా కుమారుడి వీర్యాన్ని నాశనం చేయొద్దు.. బాంబే హైకోర్టులో మహిళ పిటిషన్


చనిపోయిన తన కుమారుడి వీర్యాన్ని నాశనం చేయవద్దని, తమకు అప్పగించాలని మహారాష్ట్ర రాజధాని ముంబై కి చెందిన ఓ తల్లి బాంబే హైకోర్టు ను ఆశ్రయించింది. పెళ్లి కాకుండానే తన కుమారుడు క్యాన్సర్‌తో మృతిచెందాడని, కుటుంబ వారసత్వాన్ని నిలుపుకునేందుకు అతడి వీర్యాన్ని తమకు అప్పగించేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. తమను సంప్రదించకుండానే తన కుమారుడు మరణానంతరం తన వీర్యాన్ని నాశనం చేయమని సంతాన సాఫల్య కేంద్రం (ఐవీఎఫ్) లోని సమ్మతి పత్రాలపై సంతకం చేశారని ఆమె కోర్టుకు చెప్పారు. దీనిపై తాజాగా విచారణ జరిపిన జస్టిస్ మనీష్ పటేల్ ఏకసభ్య ధర్మాసనం తుది తీర్పు వెలువరించే వరకు వీర్యాన్ని కాపాడాలని సంతాన సాఫల్య కేంద్రానికి ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను జూలై 30వ తేదీకి వాయిదా వేసింది. తమ ఏకైక కుమారుడు ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడటంతో వంశాభివృద్ధి కోసం అతడి వీర్యాన్ని ఐవీఎఫ్ సెంటర్‌లో భద్రపర్చారు. అయితే తన మరణానంతరం తన వీర్యాన్ని నాశనం చేయవచ్చునని ఐవీఎఫ్ కేంద్రానికి ఇచ్చిన సమ్మతి పత్రంలో అతడు సంతకం చేశాడు. ఈ క్రమంలో కుమారుడి అతడి వీర్యాన్ని గుజరాత్‌లోని ఐవీఎఫ్ సెంటర్‌కు తరలించాలని తల్లి ముంబైలోని సంతాన సాఫల్య కేంద్రాన్ని కోరింది. దాంతో ఆమె కుమారుడు తన వీర్యాన్ని మరణాననంతరం నాశనం చేయవచ్చని సమ్మతి పత్రంపై సంతకం చేసిన విషయాన్ని వారు తెలిపారు. దాంతో ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించారు.



# గేట్స్ ఫౌండేషన్‌కు వారెన్ బఫెట్ భారీ విరాళం

ప్రపంచ దిగ్గజ బిజినెస్ మ్యాన్ వారెన్ బఫెట్ దాతృత్వంలో ముందుంటారు. ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థలకు తన వంతు సాయంగా పెద్ద మొత్తంలో విరాళాలు అందించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు. ఈసారి కొన్ని రూ.వేల కోట్లను స్వచ్ఛంద సంస్థకు దానం చేశారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ నిర్వహిస్తున్న గేట్స్ ఫౌండేషన్‌కు వారెన్ బఫెట్ భారీ విరాళం ఇచ్చారు. 6 బిలియన్ డాలర్ల విలువైన బెర్క్‌షైర్ హాత్ వే షేర్లను విరాళంగా అందించారు. వీటి మొత్తం విలువ దాదాపు రూ.50 వేల కోట్లు అని అంచనా. ఒక్క ఏడాదిలో ఇంత మొత్తం విరాళంగా ఇవ్వడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ మొత్తాన్ని గేట్స్ ఫౌండేషన్‌తోపాటు, కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఫోర్బ్స్ మ్యాగజైన్ ధనవంతుల జాబితాలో వారెన్ బఫెట్ 152 బిలియన్ డాలర్ల నికర విలువతో ఐదో స్థానంలో నిలిచారు. తాజా విరాళంతో ఆయన ఆరో స్థానానికి చేరుకున్నారు.





# పెళ్లంటే పరుగు తీస్తున్న ప్రభాస్..

కొందరు పెళ్లి పేరు ఎత్తితేనే పారిపోతుంటారు. అందులో డార్లింగ్ ప్రభాస్ ముందు వరుసలో ఉంటాడు. 45 ఏళ్లు వచ్చినా ఇంకా పెళ్లి ముచ్చటే లేదు. ఈ ఏడాదే ప్రభాస్ బ్యాచిలర్ లైఫ్‌కు ఫుల్‌స్టాప్ పడుతుందంటూ ఎప్పటికప్పుడు ఊహాగానాలు వినిపించినా అవన్నీ ఉట్టి పుకార్లుగానే మిగిలిపోయాయి. డార్లింగ్ జీవితంలోకి రాబోయే అమ్మాయి ఎక్కడుందో? ఏంటో? లక్కీ గర్ల్ అని అభిమానులు సరదాగా అనుకుంటూ ఉంటారు.

## పెళ్లంటే ముఖం చాటేస్తున్న హీరో

అయితే ఎవరెన్ని అనుకున్నా.. వయసు మీద పడుతున్నా సరే.. ప్రభాస్ మాత్రం పెళ్లంటేనే నాలుగడుగులు వెనకడుగు వేస్తున్నాడు. వయసు దాటిపోతున్నా.. లెక్క చేయడం లేదు. రియల్ లైఫ్‌లోనే కాదు రీల్ లైఫ్‌లో కూడా ఇదే జరిగింది. కన్నప్ప సినిమాలో రుద్ర పాత్రలో కనిపించాడు ప్రభాస్. ఓ సీన్‌లో తిన్నడు(విష్ణు).. రుద్ర(ప్రభాస్)ను నీకు పెళ్లయిందా? అని అడుగుతాడు. అందుకు రుద్ర.. నా పెళ్లి గురించి నీకెందుకులే.. అని కౌంటరిచ్చాడు. అప్పుడు విషయం అర్థమైన తిన్నడు.. పెళ్లి చేసుకుంటే తెలిసేది అని డైలాగ్ విసురుతాడు. ఈ సంభాషణకు థియేటర్‌లో చప్పట్లు, విజిల్స్ గట్టిగానే పడ్డాయి. ప్రభాస్ అభిమానుల అరుపులతో థియేటర్ దద్దరిల్లిపోతోంది. కన్నప్ప సినిమా విషయానికి వస్తే.. విష్ణు ప్రధాన పాత్రలో నటించాడు. అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించాడు. ఈ మూవీ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



# నిన్ను గర్వపడేలా చేస్తా..
## విజయ్‌కి ప్రామిస్ చేసిన రష్మిక

విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక ప్రేమలో ఉన్నారనే గాసిప్ గత కొనేళ్లుగా నెట్టింట చక్కర్లు కొడుతూనే ఉంది. వాటిపై ఇటు రష్మిక కానీ అటు విజయ్ కానీ స్పందించడం లేదు కానీ..'అవును మేం ప్రేమలోనే ఉన్నాం' అన్నట్లుగా అప్పుడప్పుడు హింట్ అయితే ఇస్తున్నారు. కలిసి ట్రిప్స్‌కి వెళ్తున్నార.. ఒకరి సినిమాపై ఒకరు పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. ఇక ఏదైనా సినిమా ఈవెంట్స్‌లో ప్రేమ, పెళ్లి ప్రస్తావన వస్తే.. పరోక్షంగా తాము రిలేషన్‌లో ఉన్నట్లుగానే ఒప్పుకుంటున్నారు. ఒకే లొకేషన్స్ ఉన్న ఫోటోలను దిగి సోషల్ మీడియాలో పోస్ట్ పెడుతూ..తమ లవ్ మ్యాటర్‌ని కొంచెం కొంచెం రివీల్ చేస్తున్నారు. తాజాగా రష్మిక విజయ్‌కి ముద్దుగా కొత్త పేరుతో పిలిచి.. మరోసారి ప్రేమ పుకార్లకు ఆజ్యం పోసింది.

**వారియర్‌గా రష్మిక..**

ఇటీవల కుబేర చిత్రంలో ప్రేక్షకులను పలకరించిన రష్మిక.. ఇప్పుడు మరో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అదే మైసా. రవీంద పూలే దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాలో రష్మిక డిఫరెంట్ పాత్ర పోషిస్తుంది. తొలిసారి ఆమె వారియర్‌గా కనిపించబోతుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. అందులో రష్మిక వారియర్ లుక్‌లో కనిపించి అందరిని సర్‌ప్రైజ్ చేసింది. చాలా మంది సినీ తారలు మైసా పోస్టర్ లుక్‌పై ప్రశంసలు కురిస్తూ.. రష్మికకి ఆల్ ది బెస్ట్ చుబుతున్నారు. అలా విజయ్ దేవరకొండ కూడా మైసా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ఇన్‌స్టాలో షేర్ చేస్తూ.. 'ఈ సినిమా అద్భుతంగా ఉండనుంది' అని రాసుకొచ్చాడు.

**విజ్జూ.. నువ్వు గర్వపడేలా చేస్తా**

విజయ్ పోస్ట్‌పై రష్మిక స్పందించింది. ఆయనకు కృతజ్ఞతలు చెబుతూ.. 'విజ్జూ.. ఈ సినిమాతో నువ్వు గర్వపడేలా చేయబోతున్నాను' అంటూ రష్మిక రిప్లై ఇచ్చింది. విజయ్‌తో అలా ముద్దుగా విజ్జూ అని పిలవడంతో మరోసారి వీరి ప్రేమ వ్యవహారంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఇండస్ట్రీలో విజయ్‌కి చాలా మంది హీరోయిన్లు స్నేహితులుగా ఉన్నప్పటికీ... ఎవరూ కూడా అలా పిలవలేదు. విజయ్‌తో రష్మికకు స్నేహానికి మించిన బంధం ఉంది కాబట్టే అలా ముద్దుగా పిలిచిందని చాలా మంది నెట్టింట పోస్టులు పెడుతున్నారు.

# చెత్తగా నటించావ్..
## పోయి మానిటర్‌లో చూస్కోపో అని తిట్టడంతో ఏడ్చేశా..



విమర్శలు అందుకోని సెలబ్రిటీలు ఉండరు. ఏదో ఒక సందర్భంలో, ఏదో ఒక సినిమా రూపంలో వారు విమర్శలపాలవుతూనే ఉంటారు. హీరోయిన్ కీర్తి సురేశ్ కూడా అలా తిట్లు తినే ఇక్కడివరకు వచ్చిందట! ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ఉప్పు కప్పరంబు. సుహాస్ కీలక పాత్ర పోషించిన ఈ మూవీ అమెజాన్ ప్రైమ్‌లో జూలై 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో కీర్తి సురేశ్ తనను బాధపెట్టిన ఓ సంఘటనను చెప్పకొచ్చింది.


### ఇప్పటికీ బాగా గుర్తు

కీర్తి మాట్లాడుతూ.. ప్రియదర్శన్ సర్ డైరెక్ట్ చేసిన మలయాళ చిత్రం(గీతాంజలి)తో కథానాయికగా నా జర్నీ మొదలైంది. అప్పుడు జరిగిన ఓ సంఘటన నాకు చాలా బాగా గుర్తుంది. ఓ సన్నివేశం షూటింగ్ అయ్యాక.. ఎంత చెత్తగా చేశావో తెలుసా? వెళ్లి మానిటర్ చూసుకోపో అని తిట్టాడు. నాకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నాకు అది మొదటి సినిమా కావడంతో ఏడ్చేశాను. ఆయన అందరినీ అలానే అనేస్తాడు. ఆయన కూతురు, నటి కళ్యాణి ప్రియదర్శన్‌ను కూడా అలాగే తిట్టేవాడు.

### అంతదాకా తెచ్చుకోను

కానీ ఉప్పుకప్పరంబు డైరెక్టర్ అని శశి మాత్రం నటీనటులకు చాలా స్వేచ్ఛ ఇస్తాడు. ఈయన ఆవేశంతో తిట్టేవరకు పరిస్థితులు చేయిదాటిపోనివ్వను. అప్పటికే ఆయన చెప్పిన సీన్‌లో బాగా నటిస్తాను. ఇంకో విషయమేంటంటే.. ఈ డైరెక్టర్ మంచి నటుడు కూడా! చాలామంది డైరెక్టర్లు చెప్తారంతే.. కానీ ఈయన ఎలా యాక్ట్ చేయాలని చేసి చూపిస్తాడు అని కీర్తి సురేశ్ చెప్పకొచ్చింది. గీతాంజలి చిత్రంతో హీరోయిన్‌గా కెరీర్ మొదలుపెట్టిన కీర్తి సురేశ్.. తెలుగులో నేను శైలజ, నేను లోకల్, మహానటి, రంగ్‌దే, దసరా, సర్కారువారిపాట వంటి పలు చిత్రాల్లో నటించింది. కల్కి 2898 ఏడీ చిత్రంలో ప్రభాస్ వాడే కారుకు వాయిస్ ఓవర్ ఇచ్చింది.

# ధగడ్ ఆగయా.. నాని
# ది ప్యారడైజ్
## నుంచి దర్శకుడి అప్‌డేట్



హిట్ 3తో సూపర్ హిట్ అందుకున్న నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేయగా.. మంచి స్పందన లభించింది. తాజాగా ఈ మూవీ నుంచి సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకున్నాడు దర్శకుడు శ్రీకాంత్. ఈ సినిమా సెట్స్‌లోకి నాని ఎంటర్ అయినట్లు తెలిపాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకోబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రం తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది (2026) మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగిన కొన్ని నిజమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు సమాచారం. ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతోంది.

# 42 ఏళ్ల నటి మృతి.. గుండెపోటు కాదా..?
## పోలీసులు ఏం చెప్పారంటే..?



'కాంటా లగా'ఫేం, బాలీవుడ్ నటి షెఫాలీ జరివాలా(42) మృతితో బాలీవుడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రియాంక చోప్రా, లారదత్తాతో పాటు పలువుడు బాలీవుడ్ తారలు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలుపుతున్నారు. శుక్రవారం ఆమె గుండెపోటుతో మరణించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆమె గుండెపోటుతో మరణించినట్లు ఆధారలేవి లేవని, మృతికి ఇంకా కారణాలు తెలియలేదని పోలీసులు చెబుతున్నారు.

**అసలేం జరిగిందంటే..**

శుక్రవారం రాత్రి షెఫాలి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ఆమె భర్త పరాగ్ త్యాగి ఆమెను అంథేరిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు వెల్లడించారు. అమె కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందినట్లు తొలుత వార్తల వచ్చాయి. కానీ ఆమె కుటుంబ సభ్యులు మాత్రం వాటిని ధ్రువీకరించలేదు.

**పోలీసులు ఏం చెబుతున్నారంటే..**

షఫాలీ మృతిపై తాజాగా ముంబై పోలీసులు అప్‌డేట్ ఇచ్చారు. ఆమె మృతికి గల కారణాలు ఇంకా తెలియలేదని, ప్రస్తుతం అనుమానాస్పద ఘటనగానే పరిగణలోకి తీసకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. 'అర్థరాత్రి ఒంటిగంట సమయంలో మాకు సమాచారం వచ్చింది. అంధేరీలోని షఫాలి నివాసంలో ఆమె మృతదేహాన్ని పరిశీలించాం. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని కూపర్ ఆస్పత్రికి తరలించాం. మరణానికి గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం ఆమె అపార్ట్‌మెంట్‌లో ఫోరెన్సిక్ నిపుణులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అలాగే ఇంట్లో పని చేస్తున్న వారిని, వంట మనిషిని ప్రశిస్తున్నాం. ప్రస్తుతానికి అయితే అనుమానస్పద ఘటనగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం' అని ముంబై పోలీసులు తెలిపారు.

**రీమిక్స్ సాంగ్‌తో ఫేమస్..**

2002లో వచ్చిన 'కాంటా లగా' రీమిక్స్ సాంగ్‌తో ఫేమస్ అయింది షెఫాలి. ఈ గుర్తింపుతోనే సినిమా అవకాశాలు వచ్చాయి. సల్మాన్ ఖాన్ ముజ్సే షాదీ కరోగా చిత్రంలో కీలక పాత్ర పోషించింది. అనంతరం పలు టీవీ రియాలిటీ షోలతో పాపులారిటీ సంపాదించుకుంది. హిందీ బిగ్‌బాస్ సీజన్ 13లోనూ కంటెస్టెంట్‌గా పాల్గొని అలరించింది. 2004లో సంగీత దర్శకుడు హర్మీత్ సింగ్‌ని వివాహం చేసుకుంది. 2009లో అతనితో విడాకులు తీసుకొని.. 2015లో నటుడు పరాగ్ త్యాగిని రెండో వివాహం చేసుకుంది.

# ఉత్కంఠభరితంగా... కళ్లకు కట్టినట్లుగా...

9/11... అమెరికా చరిత్రలో ఇదో మరచిపోని సంఖ్య. నాటికి, నేటికి, రేపటి తరానికి గుర్తుండిపోయే దారుణ ఘటన ఈ 9/11. న్యూయార్క్ నగరంలోని రెండు పెద్ద ఆకాశ హార్మ్యాలను విమానాలతో నేలమట్టం చేసి దాదాపు 3000కి పైగా ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన అతి కిరాతక చర్యగా అమెరికా చరిత్రలో నిలిచిపోయింది. అత్యంత హేయమైన ఈ తీవ్రవాద దాడి 9/11కి సూత్రధారి బిన్ లాడెన్. అంతటి కరుడు గట్టిన తీవ్రవాదిని ఉత్కంఠభరితంగా మట్టుబెట్టాయి నిఘా సంస్థలు. ఇదే ఇతివృత్తంగా నాటి ఘటనలను సిరీస్ రూపంలో నేడు నెట్ ఫ్లిక్స్ మన ముందుకు తీసుకొచ్చింది. 'అమెరికన్ మేన్ హంట్: ఒసామా బిన్ లాడెన్' పేరుతో ఈ సిరీస్ మూడు భాగాలతో నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. తెలుగు భాషతోపాటు దాదాపు అన్ని భారతీయ భాషలలో ఈ సిరీస్‌ని విడుదల చేశారు. ఇందులో గొప్ప విషయం ఏమిటంటే ... సిరీస్ మొత్తం అప్పుడు జరిగిన కొన్ని వాస్తవ సన్నివేశాలతో రూపకల్పన చేయడం. అంతేకాదు... అమెరికాలో ఈ ఆపరేషన్ గురించి అధికారులు ఎప్పటికప్పుడు అప్పటి ప్రెసిడెంట్‌కి బ్రీఫ్ చేయడం, అలాగే అప్పటి ఈ ఆపరేషన్‌కు సంబంధించిన కొందరు అధికారుల వీడియో బైట్స్‌ను కూడా చాలా చక్కగా ఎడిట్ చేసి, చూపించారు. నిజానికి ఈ సిరీస్ చూడడం మొదలు పెట్టిన కొద్ది సమయానికే మనం కూడా ఈ ఆపరేషన్‌లో వర్చ్యువల్‌గా ఇన్వాల్వ్ అయిపోతాం. మనకు 9/11 ఘటన గురించి తెలిసింది పిడికెడంత అయితే ఈ సిరీస్ ద్వారా కొండంత విషయాలు తెలుస్తాయి. 'అమెరికన్ మేన్ హంట్: ఒసామా బిన్ లాడెన్'... వర్త్‌ఫుల్ వాచ్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com